జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కుమారి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 19 : స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఏవీ కుమారిని నియమించినట్లు ఆ శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ తెలిపారు. ఇప్పటివరకు రిజిస్ట్రార్‌గా పనిచేసిన బాలంజనేయులు ఒంగోలుకు బదిలీ అయిన విషయం విదితమే. ఆయన గురువారం రిలీవ్ అయ్యారు. దీంతో ఆ స్థానంలో కుమారిని ఇన్‌చార్జిగా నియమించినట్లు డీఐజీ పేర్కొన్నారు. విజయనగరం నుంచి బదిలీపై వచ్చిన కుమారి జిల్లా మార్కెట్ వ్యాల్యూ-ఆడిట్ రిజిస్ట్రార్‌గా బుధవారం నియమితులైన విషయం తెలిసిందే.

ఆ దేవదేవుడి లడ్డూనే కల్తీనా!?



తిరుమలలో శ్రీవారి లడ్డూల తయారీలో జంతువుల కొవ్వు వినియోగించారని తెలియడంతో జిల్లావాసులు విస్తుపోయారు. అప్పటి వైసీపీ పాలకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వును కలపడం జాతి ద్రోహమని, ఇందుకు కారకులపై తక్షణం చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ నేతలూ అప్పటి పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసాదం తయారీలో వెలుగుచూసిన అంశాలపై సీబీఐతో విచారణ జరపాలని కాంగ్రెస్ నాయకులూ పట్టుబట్టారు.

- తయారీలో జంతువుల కొవ్వును కలపడమా!?
- విస్తుపోతున్న జిల్లా ప్రజానీకం
- కమలనాథుల ఆగ్రహం.. జేసీకి వినతి
- మండిపడ్డ టీడీపీ నేతలు

ప్రతిష్టను దెబ్బతీశారు!

- టీడీపీ నేత కోటంరెడ్డి ఆగ్రహం

నెల్లూరు (వ్యవసాయం) : హిందువులు పరమ పవిత్రంగా భావించే తిరుమల ప్రతిష్టను గత వైసీపీ పాలకులు దెబ్బతీశారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో కోటంరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కల్తీ నూనెతో తిరుమల లడ్డూను తయారు చేశారన్న చంద్రబాబు వ్యాఖ్యలు అక్షరాల సత్యమని అన్నారు. వైఎస్. జగన్మోహన్ రెడ్డిపాటులో ఆయన కుటుంబ సభ్యులను వెంకటేశ్వర స్వామి క్షమించడని ఆగ్రహం వ్యక్తం చేశారు.



సీబీఐ విచారణ వేయాలి : కాంగ్రెస్

నెల్లూరు (సాంస్కృతికం) : తిరుమల లడ్డూ కల్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి నిజనిర్ధారణ కోసం సీబీఐ విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమలను వైసీపీ, తెలుగుదేశం పార్టీలు రాజకీయాలకు వాడుకుంటున్నాయని, దీనిని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. జంతువుల కొవ్వులతో లడ్డూ ప్రసాదం తయారీ వంటి విషయాలపై నిగ్గు తేల్చేందుకు సీబీఐ లేదా జ్యుడీషియల్ కమిటీని తక్షణం వేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం టీటీడీకి అవసరమైన నెయ్యిని ఈ కంపెనీ సరఫరా చేస్తోందో ఆ వ్యవహారాలన్నీ బయటపెట్టాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జేసీ కార్తీక్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

ఇది జాతిద్రోహం : బీజేపీ

నెల్లూరు(హరనాథపురం) : హిందువుల ఆరాధ్యదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వును కలపడం జాతి ద్రోహమని, ఇందుకు కారకులపై తక్షణం చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ లడ్డూ కల్తీ అంశమై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటనతో స్వామివారి భక్తుల విశ్వాసాలు దెబ్బతిన్నాయని చెప్పారు. తిరుమలలో అపవిత్రం జరగటంపై కోట్లాది మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రకటనతో సరిపెట్టకుండా ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టి కల్తీకి పాల్పడ్డ వారిపై కఠినమైన కేసులు నమోదు చేయాలని కోరారు. బీజేపీ నమామిగంగే ప్రాజెక్టు రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో హిందువుల మనోవిశ్వాసాలపై దెబ్బ కొట్టిన వారు ఎంతటివారైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కరణం సుభాషిణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

2047 విజన్ డాక్యుమెంటు రూపకల్పనలో వృద్ధి చోదకాలు

అధికారులకు కలెక్టర్ ఆదేశం

నెల్లూరు(హరనాథపురం) : స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంటు రూపకల్పనతో జిల్లాలో ముఖ్యమైన రామాయపట్నం, కృష్ణపట్నంపోర్టులతోపాటు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, టెంపుల్ టూరిజం తదితర వృద్ధి చోదకాలను పరిగణలోకి తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఆ డాక్యుమెంటు తయారీపై రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ స్థిరమైన సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ ద్వారా ఉద్యోగాలు సృష్టించడం, తద్వారా ఉపాధి అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పశ్చిమ ప్రాంతం హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు అవసరమైన వివరాలను డాక్యుమెంటులో పొందుపరచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు విధిగా నివేదికలు తయారు చేసి జిల్లా ప్రణాళిక అధికారికి అందచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, సీపీఓ రాజు పాల్గొన్నారు.

- **పరిశ్రమల ఏర్పాటుపై...**

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించి పారిశ్రామికాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ స్పష్టం చేశారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అమలుతోపాటు లబ్ధిదారులకు పీఎంఈజీపీ రుణాలను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, ఏపీఐఐసీ జెడ్ఎం శేఖర్‌రెడ్డి, డీజెడ్ఎం వెంకటసురేష్, పొల్యూషన్ అధికారి రాజశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.


- **అందబాటులో ఇసుక**

జిల్లావాసులకు ఇబ్బందులు లేకుండా ఇసుకను అందిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించారు. గురువారం ఏపీ శాండ్ పోర్టల్‌ను ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇసుక లభ్యత గురించి కలెక్టర్ వివరిస్తూ ప్రస్తుతం డీసిల్టేషన్ ద్వారా సేకరించి 30 వేల టన్నుల ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అక్టోబరు 15 నుంచి పల్లిపాడు, మినగల్లు, విరువూరు, పడమటికంబంపాడు రీచ్‌ల ద్వారా కూడా ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. రూ.380 ఉన్న టన్ను ఇసుకను తగ్గించి రూ.350లకే అందజేస్తున్నట్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఇసుకను అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వదల బొమ్మాళీ.. నిన్నొదలా..! అంటూ పలువురు వివాదాస్పద అధికారులు జిల్లాను వీడనంటున్నారు. నాడు వైసీపీ నేతల ఆదేశాలే శిరోధార్యంగా భావించి ఇష్టానుసారంగా వ్యవహరించిన సదరు అధికారుల మూలంగా ప్రజలకు కష్టాలతోపాటు ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లింది. అలాంటి అధికారులు ప్రభుత్వం మారినా మళ్లీ జిల్లాలోనే తిష్ట వేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. సిఫారసు లేఖల కోసం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ నెల 22వ తేదీలోగా జిల్లాస్థాయి అధికారుల బదిలీలు ఉంటాయన్న ప్రచారం నడుస్తోంది. ఈలోపు వీలైనంత ఎక్కువ లేఖలు సంపాదించే పనిలో వివాదాస్పద అధికారులు నిమగ్నమయ్యారు.



వదల బొమ్మాళీ.. వదలం!

- జిల్లాను దాటనంటున్న వివాదాస్పద అధికారులు
- గత ప్రభుత్వంలో నేతల ఆదేశాలతోనే విధులు
- ఈ ప్రభుత్వంలోనూ కొనసాగేందుకు ప్రయత్నాలు
- కీలక పోస్టుల కోసం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు

'విధిలేని పరిస్థితుల్లో గతంలో పాలకులు చెప్పినట్టు చేశాం. అవేమీ మనసులో పెట్టుకోకండి. ఇప్పుడు మీరు ఏం చెప్పినా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాము. ఆ పోస్టు కోసం మీరు సిఫారసు లేఖ ఇవ్వండి చాలు.'

- ఎమ్మెల్యేలకు కొంతమంది అధికారుల వేడుకోలు

నెల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది అధికారులు పరిధి దాటి వ్యవహరించారు. చాలా మంది ఇప్పటికీ కీలక పోస్టుల్లో కొనసాగుతుండగా వారు మళ్లీ మరో కీలకమైన పోస్టులోకి మారేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అదే సమయంలో పక్క జిల్లాల్లో వైసీపీ భక్తులుగా పేరుగాంచి వివాదాలకు కేరాఫ్‌గా నిలిచిన అధికారులు కూడా జిల్లావైపే తొంగి చూస్తున్నారు. ప్రస్తుతం ఓ కీలక పోస్టులోని అధికారి దాదాపు నాలుగేళ్ల నుంచి ఇక్కడే ఉన్నారు. ఎన్నికల సమయంలో కూడా బదిలీ కాకుండా ఆ పోస్టుకున్న ఎన్నికల విధులను మరోపోస్టుకు మార్పించారు. సదరు అధికారిపై వైసీపీ ప్రభుత్వంలో అనేక ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు డ్వామా పీడీగా చేరేందు ఆ అధికారి ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలానే కొన్నేళ్లుగా జిల్లాలోనే ఉంటూ ఇప్పుడు మరో కీలక పోస్టులో ఉన్న మరో అధికారిపై కూడా అనేక విమర్శలు ఉన్నాయి. ఆ అధికారికి తొలుత నుడా వీసీ పోస్టును ఆశించినా కొందరు ఎమ్మెల్యేలు ఒప్పుకోలేదు. దీంతో ఎలాగైనా ఏదో ఒక పోస్టులో జిల్లాలోనే ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఐటీడీఏ పీవో పోస్టుకు సిఫారసు లేఖలు సంపాదించే పనిలో ఉన్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో వివిధ పోస్టుల్లో పనిచేసి వివాదాలకు కేరాఫ్‌గా మారిన మరో అధికారి ఇప్పుడు డీఆర్‌డీఏ పోస్టు కోసం శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ అధికారిపై నాడు దివ్యాంగులు ఆరోపణలు చేయడంతోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడం గమనార్హం. గతంలో జిల్లాలో పనిచేసి ఆ తర్వాత ప్రకాశం జిల్లాలో కీలకమైన పోస్టులో పనిచేసి వైసీపీ వీరభక్తుడిగా పేరు సంపాదించుకున్న మరో అధికారి ఇప్పుడు జిల్లాలో కీలకమైన డీపీవో పోస్టుకు ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. 'ప్రకాశం'లో నాడు టీడీపీ నేతలే సదరు అధికారి తీరుపై హైకోర్టు వరకు వెళ్లడంతో ఎన్నికల విధులకు దూరమయ్యారని సమాచారం. ఇరిగేషన్ శాఖలో అత్యంత వివాదాస్పదమైన ఓ డివిజన్‌లో పనిచేస్తున్న అధికారిపై అనేక విమర్శలు, ఆరోపణలు ఉన్నాయి. ఆ అధికారి ఇప్పుడు మళ్లీ జిల్లాలోని మరో కీలకమైన డివిజన్‌కు వెళ్లేందుకు లాబీయింగ్ చేస్తున్నారు. ఇలా అనేక మంది జిల్లా, డివిజన్ స్థాయి వివాదాస్పద అధికారులు మళ్లీ కీలక పోస్టులు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

- **సిఫారసుల కోసం పరుగు**

గత ప్రభుత్వంలో వైసీపీ భక్తులుగా పనిచేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇటువంటి అధికారులకు కీలక పోస్టులు కట్టబెట్టకుండా గత ప్రభుత్వంలో వివక్షకు గురైన అర్హత కలిగిన అధికారులకు కీలక పోస్టులు అప్పగించాలని నిర్ణయించింది. అయితే కొందరు వివాదాస్పద అధికారులు ఈ కంచెను ఛేదించి ఎలాగైనా మళ్లీ కీలకపోస్టులో కూర్చోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యేల సిఫార్సుల కోసం వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే, వారి గురించి తెలిసిన కొందరు ఎమ్మెల్యేలు మాత్రం లెటర్లు ఇవ్వడం లేదు. మరికొందరి నుంచి మాత్రం వేర్వేరు మార్గాల ద్వారా లెటర్లు సంపాదించుకుంటున్నారు. ఈ లెటర్లు తీసుకొని పలానా ఎమ్మెల్యే లెటర్ ఇచ్చారు.. మీరు కూడా లెటర్ ఇవ్వండి ప్లీజ్ అంటూ మరో ఎమ్మెల్యే వద్దకు వెళ్లి మాయ చేస్తున్నట్లు అధికార వర్గాల్లో చర్చించుకుంటున్నారు. ఈ నెల 22వ తేదీతో బదిలీల ప్రక్రియ ముగుస్తుంది. ఆ వెంటనే జిల్లా స్థాయి అధికారుల బదిలీలు ఉంటాయన్న ప్రచారం నడుస్తోంది. ఈలోపు వీలైనంత ఎక్కువ మంది లెటర్లు సంపాదించే పనిలో వివాదాస్పద అధికారులు నిమగ్నమయ్యారు. ఈ వ్యవహారం ఇప్పుడు ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



'లెక్కల మాస్టారు'ను తప్పించాల్సిందే!

- సైన్స్ బాధ్యతలను సైన్స్ టీచర్‌కే ఇవ్వాలి
- స్కూల్ కాంప్లెక్స్‌లలో తీర్మానం
- సంతకాలు సేకరిస్తున్న వైనం

నెల్లూరు (విద్య) : సైన్స్ కేంద్రం ఇన్‌చార్జిగా, జిల్లా సైన్స్ అధికారి (ఇన్‌చార్జి)గా నియమించిన లెక్కల మాస్టారును వెంటనే తప్పించాలని జిల్లావ్యాప్తంగా సైన్స్ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'లెక్కల మాస్టారుకు సైన్స్ బాధ్యత లు' అన్న కథనంపై జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులంతా స్పందించారు. నిబం ధనలు గాలికి వదిలి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న జిల్లా విద్యా శాఖ అధి కారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా జిల్లాలోని స్కూల్ కాంప్లెక్స్‌లలో సమావేశాలు నిర్వహిస్తూ పలు తీర్మానాలు చేశారు. జిల్లా సైన్స్ బాధ్యతలను సైన్స్ ఉపాధ్యాయులకే అప్పగించాలని, రాజకీయ ప్రలోభాలకు తలొగ్గి సైన్స్‌కు సంబంధం లేని వ్యక్తులను నియమించడం సరికాదని తెలిపారు. దీనిపై జిల్లాలోని 1200 మంది సైన్స్ ఉపాధ్యాయులంతా ఏకమై సంతకాల సేకరణ చేపడుతున్నారు. నెల్లూరులో నివాసం ఉంటూ రాపూరు మండలం జడ్పీ పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ గణితం మాస్టార్‌ను ఎలా నియమిస్తారంటూ ఉన్నతాధికారులకు మెసేజ్‌ల రూపంలో, నివేదికల రూపంలో అందచేస్తున్నారు. లెక్కల మాస్టార్ తనకున్న పలుకుబడితో ఓ ప్రజా ప్రతినిధి అనుమతి లెటర్ తీసుకెళ్లి డీఈఓకు ఇవ్వడంతోపాటు డీఈఓకు చెప్పించుకుని మరీ జిల్లా సైన్స్ కేంద్రం ఇన్‌ఛార్జిగా ఉత్తర్వులు సాధించుకోవడం అన్యాయమన్నారు. మరో రెండు రోజుల్లో సంతకాల సేకరణ పూర్తయిన వెంటనే అర్జీలను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు, డీఈఓకు అంద చేయనున్నట్లు సైన్స్ ఉపాధ్యా యులు తెలిపారు. దీనిపై వెంటనే నిర్ణయం తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.



టీడీపీలో చేరిన కార్పొరేటర్లతో మంత్రులు నారా లోకేష్, నారాయణ

టీడీపీలోకి మరో 14 మంది కార్పొరేటర్లు

నెల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరం నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. ఇటీవల పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నేతలు టీడీపీ కండువాలు కప్పుకోగా తాజాగా మరో 14 మంది కార్పొరేటర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం అమరావతిలో మంత్రి పొంగూరు నారాయణ సమక్షంలో వీరందరికీ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నుడా మాజీ చైర్మన్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నేత ముక్కాల ద్వారకానాథ్‌తో పాటు కార్పొరేటర్లు సంక్రాంతి అశ్విని, ప్రత్యూష, రవిచంద్ర, ఎం మస్తానమ్మ, కిన్నెర ప్రేమ్‌కుమార్, గోతం అరుణ, కర్తం ప్రతాప్‌రెడ్డి, జీ వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పొట్లూరు రామకృష్ణ, షేక్ ఇంతియాజ్, వి రాజేశ్వరి, కాయల సాహిత్య, షేక్ షఫియా బేగం, కోఆప్షన్ సభ్యుడు షేక్ జమీర్‌లు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. కాగా, ఇప్పటివరకు నగర నియోజకవర్గం నుంచి 23 మంది, రూరల్ నుంచి 20 మంది అధికారికంగా టీడీపీలో చేరారు. కార్పొరేషన్‌లో 54 మంది కార్పొరేటర్లు ఉండగా, 43 మంది టీడీపీ వైపు ఉన్నారు. కాగా టీడీపీలో చేరిన కార్పొరేటర్లు మాట్లాడుతూ నెల్లూరు నగరాభివృద్ధే తమకు ప్రధానమని, అది మంత్రి నారాయణతోనే సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి కూడా ఉన్నారు.

దిగుబడుల్లేక డీలా..

- ఆశాజనకంగా సజ్జల ధర
- తగ్గిన దిగుబడులతో రైతుల దిగాలు
- పెట్టుబడులు కూడా రావని ఆవేదన



విక్రయానికి సిద్ధంగా ఉన్న సజ్జలు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 19: మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో సజ్జ పైరు సాగు చేసిన రైతులు దిగులు చెందుతున్నాడు. ధర ఆశాజనకంగా ఉన్నా దిగుబడులు లేకపోవడంతో పెట్టుబడులు కూడా రావని వాపోతున్నాడు. జిల్లాలో 2132.81 ఎకరాల్లో సజ్జ పైరు సాగు చేశారు. ప్రధానంగా ఉదయగిరి సబ్‌డివిజన్‌లోని సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు, ఉదయగిరి తదితర మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో సజ్జపైరు సాగు చేశారు. ప్రస్తుతం సజ్జ కోత దశకు రావడంతో రైతులు నూర్పిళ్ల ప్రారంభించారు. అయితే ఆశించినమేర దిగుబడి లేకపోవడంతో పెట్టుబడులకే సరిపోతుందని, కష్టమంతా వృథా అయిందని కర్షకులు వాపోతున్నారు.

పెట్టుబడి కూడా కష్టమే..

ఈ ఏడాది సజ్జపైరు సాగు చేసిన రైతులకు ఎకరాకు ఏడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. దళారులు క్వింటా రూ.2,300లకు అడుగుతున్నారు. పంట సాగుకు సుమారు రూ. 15 వేల వరకు ఖర్చయింది. ఈ ధరతో పెట్టుబడులు కూడా కష్టమే.



- దొడ్డంరెడ్డి కృష్ణారెడ్డి,రైతు, సోమలరేగడ

క్వింటా రూ.రెండు వేలకుపైగానే..

ఎకరా సజ్జపైరు సాగుకు సుమారు రూ.10 నుంచి రూ.15 వేలు ఖర్చవుతుందని రైతులు తెలిపారు. ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉందని, అయితే ఈ ఏడాది 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినట్లు రైతులు చెప్పారు. ప్రస్తుతం సజ్జల నాణ్యతను బట్టి క్వింటా రూ.2,300 నుంచి రూ.2,500లు పలుకుతున్నాయి. గతేడాది క్వింటా రూ.2,800లు పలికిందని, ప్రస్తుతమున్న ధరతో పెట్టుబడులు రాగా, రైతు కష్టం వృథా అయిందని వాపోతుందన్నారు. ప్రభుత్వం సజ్జ రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

సామాన్యుల షాపింగ్‌మాల్ సండే మార్కెట్

నెల్లూరు నగరం ఎంత అభివృద్ధి చెందినా, ఎన్ని పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వెలసినా సామాన్యుల షాపింగ్‌కు కేరాఫ్ అడ్రస్ సండేమార్కెట్. పండగొచ్చినా, ఇంట్లో శుభకార్యమైనా దుస్తులు కొనేది అక్కడే!. పిల్లలకు స్కూలు బ్యాగులు, చెప్పులు, బూట్లు.. ఇవన్నీ కొనేందుకు ఎక్కువ మంది వెళ్లే చోటు సండేమార్కెట్టే. నగరంలో ల్యాండ్‌మార్క్‌గా 40 ఏళ్లుగా ప్రజలతో మమేకమైన చిరు వ్యాపారుల బజారు. వందలాది కుటుంబాలకు ఉపాధి, వేలాది మందికి తక్కువ ధరలో నూతన వస్తువులను అందిస్తున్న అంగళ్ల సమూహం. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్ని నాలుగు దశాబ్దాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది.

- 40 ఏళ్ల ప్రస్థానం
- దుస్తులు, పాదరక్షలు, బ్యాగుల విక్రయాలు
- పండగొస్తే కిటకిటే!
- ఎన్నో ఆటుపోట్లు
- నేడు వార్షికోత్సవ సదస్సు




నెల్లూరు(వైద్యం): నెల్లూరులోని గాంధీబొమ్మ సమీపంలో గల కోఆపరేటివ్ బ్యాంకు గోడ పక్కన, వెనుక ఉండే వీధులే సండే మార్కెట్. తమిళ మూలాలున్న వ్యాపారులతో కూడిన ఈ మార్కెట్ 1984లో ఏర్పడింది. తొలినాళ్లలో ఆదివారాలు మాత్రమే నేలమీద పట్టలు పరుచుకుని వ్యాపారం చేసేవారు. కొందరికి మాత్రం తోపుడు బండ్లు ఉండేవి. రాత్రిపూట పెట్రో మాక్స్ లైట్ల వెలుగులో అమ్మకాలు సాగించేవారు. సండే సంతలాగా జరిగే వ్యాపారం కావడంతో దీనికి సండే మార్కెట్ అనే పేరు వచ్చింది. ఆ తర్వాత చెక్క బంకులతో శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసుకుని నిత్యం అమ్మకాలు సాగించేవారు. అయితే ఈ మార్కెట్ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది. ముఖ్యంగా 1991లో రాజీవ్‌గాంధీ హత్య అనంతరం ఇక్కడ విధ్వంసం సృష్టించారు. రాజీవగాంధీ మరణానికి తమి ళులే కారణమంటూ ఇక్కడ ఉన్న చెక్క బంకులను అర్ధరాత్రి తాళాలు పగుల గొట్టి సరుకులు లూటిచేసి బంకులను తగుల బెట్టారు. ఈ సంఘటన అప్పట్లో పెద్ద దుమారమే లేపింది. దుకాణాల ధ్వంసంతో సండేమార్కెట్‌పై ఆధార పడ్డ 90 కుటుంబాల వారు వీధినపడ్డారు. దీంతో ఆందోళన చేపట్టిన వ్యాపారులకు అప్పటి జిల్లా కలెక్టర్ రాజు సెట్నెల్ ద్వారా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి రూ. 25వేల రుణం ఇప్పించి ఆదుకున్నారు. దీంతో వ్యాపారులు మరలా బంకులు ఏర్పాటు చేసుకున్నారు. 2008 లో ఒక తమిళ వ్యాపారికి, ముస్లిం కస్టమర్లకు మధ్య చిన్న వివాదం సృష్టించి కొందరు రౌడీలు మార్కెట్‌పై విరుచుపడ్డారు. ఈ నేపథ్యంలో వ్యాపారులు 11 రోజులు దుకాణాలు మూసివేసి నిరసన వ్యక్తం చేశారు. నిందితులను అరెస్టు చేసిన తర్వాత దుకాణాలు తెరిచి వ్యాపారులు కొనసాగించారు. అలాగే 2016, 2021, 2022 సంవత్సరాల్లో కూడా మార్కెట్ విచ్ఛిన్నానికి పూనుకున్న కొన్ని శక్తులను సమర్థవంతంగా ఎదుర్కొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇలా నాలుగు దశాబ్దాలుగా నెల్లూరు వాసులకు సరసమైన ధరలకు దుస్తులు, చెప్పులు వంటివి అందిస్తున్న సండేమార్కెట్ శుక్రవారం 40వ వార్షికోత్సవం జరుపుకుంటోంది. ఈ సందర్భంగా టౌనుహాలులో సదస్సు నిర్వహిస్తున్నారు.

ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నాం



సండే మార్కెట్‌లో వ్యాపారులు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. అన్నింటినీ శాంతియుతంగా ఎదుర్కొని దుకాణాలు నడుపుకుంటున్నారు. 1991లో రాజీవ్‌గాంధీ హత్య అనంతరం తాళాలు పగులగొట్టి అందులో ఉన్న సామాన్లను లూటీ చేశారు. దుకాణాలను తగుల బెట్టారు. అప్పటి కలెక్టర్ రాజు చొరవతో వ్యాపారం కొనసాగిస్తున్నారు. మార్కెట్ ఏర్పడి 40 ఏళ్ల పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ సంబరాలు జరుపుకుంటున్నాం.

- కిశోర్ బాబు, సండే మార్కెట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు



రాజీవ్‌గాంధీ హత్య అనంతరం ధ్వంసమైన దుకాణాలు

ఇది ప్రజాప్రభుత్వం

- అన్నివర్గాల వారికి దగ్గరయ్యాం
- దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు : కోటంరెడ్డి



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (వ్యవసాయం), సెప్టెంబరు 19 : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ఎన్డీయే ప్రభుత్వం ప్రజాప్రభుత్వమని ముఖ్యమంత్రి చంద్రబాబు నిరూపించారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని ఎన్‌టీఆర్ భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తికాక ముందే అన్ని వర్గాల ప్రజలకు దగ్గరయ్యామని, దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలతోపాటు జనసేన మేనిఫెస్టోను కూడా అమలు చేస్తున్నామన్నారు. దాచుకోవడం దోచుకోవడం మాత్రమే తెలిసిన జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో తీసుకురాలేని సంస్కరణలను చంద్రబాబు 100 రోజుల్లోనే తీసుకొచ్చారని కొనియాడారు. విపత్తులను సైతం సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలిచారన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నేతలు కల్తీ మద్యాన్ని అమ్మి వేల మంది చనిపోయారని ఆరోపించారు. కల్తీ మద్యాన్ని పక్కన బెట్టి నాణ్యమైన మద్యాన్ని అమ్మేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారని వివరించారు. ఒకటో తేదీనే జీతాలు, అక్రమాలకు తావులేకుండా తక్కువ ధరకే ఇసుక అందిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, నాయకులు పిట్టి సత్య నాగేశ్వరరావు, మొయినుద్దీన్, కువ్వారపు బాలాజీ, ప్రశాంత్, అంచూరి శ్రీనివాసులు నాయుడు, సుజన్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరులో సీపీఎం జిల్లా మహాసభలు



పోస్టరు ఆవిష్కరిస్తున్న నాయకులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 19 : వామపక్ష పార్టీ సీపీఎం జిల్లా మహాసభలు డిసెం బరు 14, 15 తేదీలలో జరుగుతాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. సభల పోస్టర్లను గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మహాసభలు ఇందుకూరుపేట మండల కేంద్రంలో జరుగుతాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, భవిష్యత్ కార్యాచరణపై ఇందులో చర్చిస్తామన్నారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను యథావిధిగా కొనసాగించాలని, ముదివర్తిపాళెం- ముదివర్తి మధ్య కాజ్‌వే నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, మస్తాన్‌బీ, ప్రసాద్, కోటేశ్వరరావు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో తూలిపడి వ్యక్తి మృతి

కోవూరు, సెప్టెంబరు19: స్థానిక బజారు కూడలిలో మద్యం సేవించి వెళ్తున్న ఓ వ్యక్తి అకస్మాత్తుగా రోడ్డుపై తూలి పడ్డారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్‌టీబీ ఏటీఎం వీధికి చెందిన గుడి చిరంజీవి సోమవారం ఉదయాన్నే ఇంటి నుంచి బజారుకు చేరుకుని మద్యం సేవించి వెళ్తుండగా ముందుకు తూలి పడ్డాడు. స్థానికులు అతన్ని నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన భార్య సుజాత గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రంగనాథ్ గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ..

వెంకటాచలం, సెప్టెంబరు 19 : స్థానిక రైల్వేస్టేషన్ వద్ద గురువారం రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని మహిళ దుర్మరణం పాలయింది. స్థానికుల కథనం మేరకు, సుమారు 50 ఏళ్ల వయసున్న మహిళ గత మూడు నెలలుగా రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోనే సంచరిస్తుండేది. ఆమె పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొంది. ఆమె ఎవరు...ఎక్కడ నుంచి వచ్చిందనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆవు దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు



పీహెచ్‌సీ ప్రథమ చికిత్స చేయించుకున్న ఫక్రుద్దీన్

సీతారామపురం, సెప్టెంబరు 19: స్థానిక బస్టాండ్‌లో గురువారం ఓ ఆవు దాడి చేయడంతో సీతారామపురం గ్రామానికి చెందిన షేక్ ఫక్రుద్దీన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని వెంటనే పీహెచ్‌సీకి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	121
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7084
వెండి కిలో ధర	రూ. 91,300
వెండి ఒక గ్రాము	రూ. 94.30

యథేచ్ఛగా గ్రావెల్ దందా

- గొలగమూడిలో ఓ వైసీపీ నేత కనుసన్నల్లో రవాణా
- పట్టించుకోని అధికారులు
- గ్రామస్థుల ఆగ్రహం

వెంకటాచలం, సెప్టెంబరు 19: మండలంలోని గొలగమూడిలో ఉన్న హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ పక్కనే ఉన్న పొలాలకు మూడు రోజులుగా విచ్చలవిడిగా గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారు. రాత్రయితేచాలు గ్రావెల్ మాఫియా కళ్లు తెరుచుకుంటున్నది.ఆ ప్రాంతంలో గ్రావెల్ టిప్పర్లు పదుల సంఖ్యలో తిరుగుతూ హడావిడి సృష్టిస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు.

వైసీపీ నేత హస్తం



పొలాల్లో గ్రావెల్ తోలుతున్న టిప్పర్

గొలగమూడికి చెందిన ఓ వైసీపీ నేత, పంచాయతీ వార్డు సభ్యుడి కనుసన్నల్లోనే గ్రావెల్ దందా జరుగుతోంది. అయినా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ఐదేళ్లలో కూడా మాజీ మంత్రి కాకాణి అండదండలతో ఆ వైసీపీ నేత సర్వేపల్లి రిజర్వాయర్‌లో విచ్చలవిడిగా గ్రావెల్‌ను కొల్లగొట్టి దోచుకున్నాడన్న ఆరోపణలున్నాయి. అప్పట్లో అడ్డుకునేందుకు వెళ్లిన టీడీపీ నేతలపై అట్రాసిటీ, అత్యాచార యత్నంలాంటి అక్రమ కేసులు బనాయించారు. అయితే ప్రభుత్వం మారినా ఆ నేత గ్రావెల్ దందాను మాత్రం కొనసాగిస్తూనే ఉన్నాడు. పలువురు గ్రామస్థులు, టీడీపీ నేతలు సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి చెప్పినా పట్టించుకోలేదు. అధికారుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించాలి : ఎస్పీ



సంగం పోలీస్‌స్టేషన్‌లో సీఐ వేమారెడ్డితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

ఆత్మకూరు/సంగం, సెప్టెంబరు 19: జాతీయ రహదారులపై బ్లాక్‌స్పాట్‌లలో సైన్‌బోర్డులు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు నివారించాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పోలీసులను ఆదేశించారు. గురువారం ఆయన సంగం, ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన పోలీసు స్టేషన్ల పరిసరాలను, స్టేషన్ల పరిధిలో ఉన్న హైవే, నేర, శాంతి భద్రతల పరిస్థితులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు పెంచాలని సూచించారు. అనుమానాస్పద మరణాలు, హత్యలు, లైంగిక, వరకట్న వేధింపుల కేసులపై దర్యాప్తు వేగవంతం చేయాలని, ఇసుక అక్రమ రవాణా, దొంగతనాలు అరికట్టాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్‌లు, పాత నేరస్థులపై నిఘా పెట్టాలన్నారు. మండల పరిధిలోని గ్రామాలను సందర్శించి, ప్రజలతో మమేకమై సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, చట్టాలు, శిక్షలు గురించి అవగాహన కల్పించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న వాహనాలను కోర్టు అనుమతితో వేలంవేయాలని ఆదేశించారు. సంగంలో వినాయక నిమజ్జనంలో మహిళలపై జరిగిన దాడిపై సీఐ వేమారెడ్డిని ఆరాతీశారు. పోలీస్‌స్టేషన్లో పనిచేసే సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్‌బి డీఎస్పీ శ్రీనివాసరావు, సంగం, ఆత్మకూరు సర్కిల్ సీఐలు వేమారెడ్డి, గంగాధర్, ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాల్లో వేతనాలు వేయాలి

- మీటర్ రీడర్స్ యూనియన్



ఎస్ఈ విజయన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 19: విద్యుత్ మీటర్ రీడర్లకు బ్యాంకు ఖాతాల ద్వారా వేతనాలు చెల్లించాలని మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో ఎస్ఈ విజయన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పీ శంకర్ కిషోర్, హజరత్‌వలీ, కృష్ణ మాట్లాడుతూ మీటర్ రీడర్లకు అకౌంట్ ద్వారా వేతనాలు ఇవ్వాలని గతంలోనే ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, దానిని కింది స్థాయి అధికారులు, కాంట్రాక్టర్లు అమలు చేయడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారుల ఉత్తర్వులు అమలుపరచాలని విజ్ఞప్తి చేశారు.

ఆరోపణలు నిర్ధారణ అయితే 'మత్స్యకార' పాలకవర్గం రద్దు!

- మత్స్య శాఖ ఏడీ శ్రీనివాసులు



మహాజన సభలో మాట్లాడుతున్న మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసులు

కలువాయి, సెప్టెంబరు 19 : మత్స్యకారుల సంఘం సభ్యుల ఆరోపణలపై విచారిస్తున్నామని, నిర్ధారణ అయితే సహకార సంఘం చట్టప్రకారం చర్యలు తీసుంటామని, అవసరమైతే పాలకవర్గాన్ని రద్దు చేయాలని సిఫారసు చేస్తామని కావలి మత్స్య శాఖ ఏడీ ఎస్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక అంకమ్మ రచ్చ వద్ద గురువారం జరిగిన మత్స్యకారుల సంఘం మహాజన సభ అనంతరం ఏడీ మాట్లాడారు. 2022, జూలైలో ఏర్పడిన పాలకవర్గం అప్పటి నుంచి ఎలాంటి సమావేశాలు నిర్వహించడం లేదని, కనీసం సంఘం లావాదేవీల రికార్డులు కూడా రాయడం లేదని సభ్యులు మత్స్యశాఖ జేడీకి ఫిర్యాదు చేశారని, దీంతో ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు సంఘం మహాజన సభ ఏర్పాటుచేసి సభ్యులను విచారిస్తున్నట్లు వివరించారు. మొదట స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి మత్స్యకారులంతా ర్యాలీగా పాలకవర్గ సభ్యులపై చర్య తీసుకోవాలంటూ నినాదాలు చేస్తూ సభకు హాజరయ్యారు. మొత్తం 140 మంది సభ్యులకు గాను 86 మంది సభకు హాజరై పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఎటువంటి పాలకవర్గ సమావేశాలు గానీ, మహాజన సభలు గానీ నిర్వహించ లేదని, అయితే పాలకవర్గం వారు సమావేశాలు జరపకపోయినా జరిపినట్లు వారు అందజేసిన నివేదికలో కొందరి సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేశారని సభ్యులు తెలిపారు. ఈ విషయమై అధికారులు కొందరు సభ్యులను విచారించగా.. తాము ఎటువంటి సమావేశాలకు హాజరుకాలేదని, పాలకవర్గం వారిచ్చిన జాబితాలో వేలిముద్రలు తమవి కావని తెలిపారు. రెండేళ్ల క్రితం కువైట్‌కు వెళ్లిపోయిన సభ్యులు ఏడాది క్రితం జరిగిన సమావేశానికి హాజరైనట్లు ఉండటంతో సమావేశ ప్రాంతం నుంచే అధికారులు కువైట్‌లో ఉన్న ఆ సభ్యుడితో ఫోన్‌లో వీడియో కాల్‌లో మాట్లాడగా అతను నేను ఎటువంటి సమావేశాలకు రాలేదని, రెండేళ్లుగా కువైట్‌లో ఉన్నట్లు అధికారులకు తెలిపారు. దీంతో ఈ పాలకవర్గంపై తగిన చర్యలు తీసుకోవాలని సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎలాంటి గొడవలు జరగకుండా కలువాయి ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ నెల్లూరు ఏడీ వీ రంగనాధబాబు, వీఎఫ్ఏలు గోపీచందన, ఖాజామస్తాన్, మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల బ్యాడ్మింటన్ పోటీలు

- క్రీడాస్ఫూర్తిని చాటాలి : సీఎండీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎండీ సంతోష్‌రావు

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 19: విద్యుత్ ఉద్యోగుల బ్యాడ్మింటన్ పోటీలను నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో విద్యుత్ సంస్థ సీఎండీ సంతోష్‌రావు గురువారం ప్రారంభించారు. సంస్థ ప్రతి సంవత్సరం బ్యాడ్మింటన్, టెన్నిస్ వంటి పోటీలను నిర్వహిస్తోందని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు క్రీడాస్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రీడాకారులందరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, కృష్ణపట్నం చీఫ్ ఇంజనీర్ సుధీర్, ఎస్ఈలు విజయన్, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవో నెం.85ను రద్దు చేయాల్సిందే!

- డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద వైద్యుల నిరసన



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వైద్యులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 19 : జీవో నెంబరు 85ను రద్దు చేయాల్సిందేనని ప్రభుత్వ వైద్యులు పట్టుపడుతున్నారు. ఈ అంశంపై ప్రభుత్వంతో జరిపిన చర్చలు సానుకూలంగా సాగలేదంటూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ నీట్ పీజీ కౌన్సెలింగ్‌లో గతంలో 30 శాతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు ప్రాధాన్యత ఉండేదని, జీవో నెంబర్ 85 వల్ల అది 15 శాతానికి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆ జీవోను రద్దు చేసి గతంలో లాగానే పీజీ కౌన్సెలింగ్ చేపట్టాలని కోరారు. అలాగే టైంబౌండ్ ప్రమోషన్లలో ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి డిప్యూటీ సివిల్ సర్జన్లుగా, 12 ఏళ్ల పూర్తి చేసుకున్న వారికి సివిల్ సర్జన్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ ధర్మేంద్ర, డాక్టర్ అహ్మద్‌బాబు, డాక్టర్ బాలచంద్రబాబు, డాక్టర్ శాంతి, డాక్టర్ రమాకుమారి, డాక్టర్ భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడులు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 19: ఇళ్లమధ్య గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై పోలీసులు గురువారం దాడి చేసి విటులను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరానికి చెందిన ఖతీజా, సమి దంపతులు 20 రోజుల కిందట బాలాజీనగర్ పుట్టవీధిలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు తన సిబ్బందితో కలిసి గురువారం ఇంటిపై దాడి చేశారు. నిర్వాహకులతోపాటు సెక్స్‌వర్కర్, నగరానికి చెందిన వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. సెక్స్‌వర్కర్‌ను హోంకు తరలించారు. నిర్వాహకులు, విటునిపై కేసు నమోదు చేశారు.

వైసీపీ నేత రాజేష్‌కు బెయిల్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 19: వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో కార్పొరేటర్ భర్త, వైసీపీ నాయకుడు రాజేష్‌కు కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. వివరాల్లోకి వెళ్లితే నగరంలోని శోధన్‌నగర్‌కు చెందిన రాజేంద్రప్రసాద్ ఈ నెల 9వ తేదీన చెట్లు శుభ్రం చేస్తుండగా అతనిపై రాజేష్ దాడి చేశాడు. ఈ ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. రాజేష్ గురువారం కోర్టులో లొంగిపోవడంతో ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వ్యవసాయ సహాయకులకు శిక్షణ

కందుకూరు, సెప్టెంబరు 19: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు గురువారం నెల్లూరు జిల్లా ఆత్మ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. స్థానిక కృషి విజ్ఞానకేంద్రం సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ శిక్షణలో ఆత్మ పీడీ డాక్టరు శివనారాయణ, జిల్లా ప్రాజెక్టు మేనేజరు మాలకొండయ్యలతో పాటు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు, పలువురు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. వివిధ రకాల పంటలలో సమగ్ర సస్యరక్షణకు రైతులకు అందించాల్సిన సలహాలు, సూచనలపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకుని సేంద్రియ ఎరువులు వాడకంతో భూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు మారుతీదేవి, ముత్యాల శేషగిరి, అనసూయ, ఇఫ్కో మేనేజరు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు బీసీజీ టీకా తప్పనిసరి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 19: క్షయ నిర్మూలనకు అర్హులైన ప్రతిఒక్కరూ బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య వైద్యాధికారి వెంకటసుబ్బయ్య, క్షయ యూనిట్ పర్యవేక్షకుడు వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం నేలటూరు, కృష్ణంపల్లి సచివాలయాల పరిధిలో జరుగుతున్న బీసీజీ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరూ టీకా వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ క్లీనర్ సీహెచ్‌వో జ్యోతిషరాణి, ఏఎన్ఎంలు జమీలా, షర్మిల, ఆరోగ్య సహాయకుడు చంద్రమౌళి, ఆశ శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన

కలువాయి, సెప్టెంబరు 19 : ఉపాధిహామీ పథకం కింద ఉద్యాన పంటల సాగుపై రైతులకు డ్వామా ఇన్‌చార్జ్ పీడీ శ్రీనివాసులు గురువారం అవగాహన కల్పించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి మండలంలో 325 ఎకరాల్లో నిమ్మ మొక్కల సాగుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. మంజూరైన వెంటనే రైతులు పనులు చేపట్టి సాగు చేసుకోవాలని పీడీ రైతులకు సూచించారు. నిమ్మ సాగుకు ఎకరాకు మూడేళ్లకు రూ.1.14లక్షలు ఉపాధి నిధులు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ప్లాంటేషను ఏపీడీ మృథుల, ఏపీవో మురళీ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 19: కృష్ణంపల్లి, శకునాలపల్లి గ్రామాల్లో మొక్క జొన్న, సజ్జ పంటలను గురువారం వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్ పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పిం చారు. రైతుసేవా కేంద్రాలను పరిశీలించి రికా ర్డు లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, సెప్టెంబరు 19: వీఆర్‌కోట మన్నేరువాగు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ సుభానీ తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ముందస్తు సమాచారంతో అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదానం

కావలి టౌన్, సెప్టెంబరు 19: ప్రధాని మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా బీజేపీ నాయకులు గురువారం శ్రీసాయి డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్య క్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్‌కుమార్, నేతలు బ్రహ్మానందం, రంగారెడ్డి, సీవీసీ సత్యం, వెంకటేశ్వర్లు, మాధవిరెడ్డి, బెల్లంకొండ మాల్యాద్రి, మందా కిరణ్, సుందరశెట్టి సుజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం అన్యాకాంతం

● అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేమిటో..?

కావలి, సెప్టెంబరు 19: స్థానిక ముసునూరు అయ్యప్పస్వామి గుడి సమీపంలోని కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలం అన్యాకాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. ఆ స్థలం ట్రంకు రోడ్డు వెంబడే ఉండటంతో గతంలో ఎంతో మంది అక్రమార్కుల కన్ను దానిపై పడింది. ఆ స్థలంలో మట్టి తోలుతున్న వారిని అధికారులు ఆపించి ఇది ప్రభుత్వ స్థలం దీనిలో ఎవరూ ప్రవేశించినా శిక్షార్హులని పెట్టిన బోర్డు కొంతకాలం అక్కడే ఉండింది. కాలక్రమేణ ఆ బోర్డు మాయమైనా ఆ స్థలం జోలికి ఎవ్వరూ రాలేదు. అయితే ప్రస్తుతం అక్కడ ఏమి మాయ జరిగిందో తెలియదు కాని రోడ్డు పక్కనే ఉన్న ఆ స్థలంలో రేకుల షెడ్లు పక్కాగా నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. దాన్ని చూచిన ప్రజలు మొన్నటి వరకు ప్రభుత్వ స్థలంగా ఉన్న ఈ ప్రాంతం ఇంతలో ప్రయివేట్ స్థలంగా ఎలా మారింది. దీని వెనుక ఉన్న సూత్రదారులు, పాత్రదారులు ఎవరూ అని చర్చించుకుంటున్నారు. గతంలో ఎవరికైనా పట్టా ఇచ్చిఉంటే ప్రభుత్వ స్థలమని ఎలా బోర్డు పెట్టారు. ప్రభుత్వంలో ఎవరికైనా పట్టాలు ఇచ్చారా ఏమి లేకుండా అక్కడ నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు చూస్తూ ఎందుకు మౌనంగా ఉన్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ కబ్జా వెనుక భారీగా నగదు చేతుల మారాయా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.



ముసునూరు అయ్యప్ప ఆలయం పక్కన ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్లు

ప్రభుత్వ స్థలమైతే నిర్మాణాలు తొలగిస్తాం : శీనానాయక్, ఆర్డీవో

ఆ స్థలంను పరిశీలించమని అధికారులను ఆదేశించాను. ప్రభుత్వ స్థలమని నిర్ధారణ అయితే అక్కడ నిర్మించిన నిర్మాణాలను తొలగిస్తాం.

అట్టహాసంగా మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

ఆత్మకూరు, సెప్టెంబరు 19: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ పోటీలు గురువారం ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, కౌన్సిలర్‌లు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ పోటీలకు మండలంలోని ఆరు పాఠశాలల నుంచి సుమారు వందమంది విద్యార్థులు హాజరయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: స్కూల్ గేమ్స్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న టీడీపీ నాయకులు చంద్రారెడ్డి, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి

●సంగం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండలంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంఈవో -2 మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య ప్రారంభించారు. మొదటి రోజు అండర్ 14, 17 విభాగంలో అథ్లెటిక్స్‌లో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. షాట్‌పుట్, జావలిన్‌త్రో, హైజంప్, లాంగ్ జంప్, పరుగుపందెం, తదితర పోటీలు నిర్వహించారు. శుక్రవారం బాలురకు, శనివారం బాలికలకు కబడ్డీ, కోకో, వాలీబాల్, బాల్ బాట్మింటన్ వంటి క్రీడల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎంఈవో 2 మల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీడీ అంజయ్య, మండలంలోని పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనులందరికీ ఆధార్ కార్డులు చేయించాలి

● మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

కావలి, సెప్టెంబరు 19: పట్టణ పరిధిలోని గిరిజనులందరికీ ఆధార్ కార్డులను చేయించే బాధ్యతను వెల్ఫేర్ సెక్రటరీలు తీసు కోవాలని మున్సిపల్ కమి షనర్ శ్రావణ్ కుమార్ సూచించారు. గురువారం తన చాంబర్‌లో వారితో సమావేశమై మాట్లాడారు. పట్టణంలో 323మంది ఆధార్ కార్డులు లేని వారు ఉన్నారని కలెక్టర్ కార్యాలయం నుంచి తన సమాచారం వచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై సర్వే చేయించగా 110మందికి కొత్తగా ఆధార్ చేయించగా 72మంది చనిపోయి ఉన్నట్లు గుర్తించామన్నారు. మరో 90మంది ఎక్కడ ఉన్నారో వారి వివరాలు తెలయరాలేదన్నారు. మిగిలిన వారికి ఆధార్‌కార్డులను చేయించేందుకు జనన తేదీల సమస్య రావటంతో దాన్ని అధికమించే చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. వారికి జనన సర్టిఫికెట్లు ఇప్పించి ఆధార్ చేయించాలని ఆదేశించారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

కలువాయి, సెప్టెంబరు 19: మండలంలోని మాదన్నగారిపల్లెలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గురువారం వీఆర్వో జనార్ధన్, సర్వేయర్ నవీన్ పరిశీలించారు. గ్రామ రెవెన్యూ పరిధిలో 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఆక్రమణలపై పూర్తిస్థాయి నివేదిక ఉన్నాతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

కలువాయి మండల సమావేశం

కలువాయి, సెప్టెంబరు 19: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు సభకు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, జడ్పీటీసీ బి అనిల్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పంగా పెంచలనరసారెడ్డి, ఎంపీడీవో గోవర్దన్ వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ మంత్రి దృష్టికి కావలి సాగునీటి సమస్యలు



మంత్రి నిమ్మల రామానాయుడితో బీద రవిచంద్ర, ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, సెప్టెంబరు 19: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలను జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ సమస్యలపై చర్చించి నిధుల మంజూరు చేయమని కోరారు. ప్రధానంగా కావలి కాలువ, సీబీఆర్ బైపాస్ కెనాల్, డీఎం, డీఆర్ చానల్, సాగునీటి చెరువుల పరిస్థితులను మంత్రికి వివరించారు.

టీఆర్‌ఆర్‌లో ఆరోగ్య అవగాహన సదస్సు

కందుకూరు, సెప్టెంబరు 19: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయుర్వేద వైద్యాధికారి ఆర్డీఎస్ లక్ష్మీకుమారి, హోమియో వైద్యురాలు రత్నావళి పాల్గొన్నారు. కందుకూరు ఏరియా వైద్యశాల ఆయుష్ విభాగంలో అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఆయుర్వేద వైద్యవిధానం విశిష్టత, ప్రస్తుత పరిస్థితుల్లో మనిషి జీవన విధానంలో తీసుకోవాల్సిన మార్పులు, పౌష్టికాహార ప్రాధాన్యత అంశాలను వివరించారు. కార్యక్రమంలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం కన్వీనర్ డాక్టరు కరుణకుమార్, అధ్యాపకులు సుజాత, షాజాన్‌బేగం, కేవీ పద్మావతి, డాక్టరు రామకృష్ణ పాల్గొన్నారు.

జీవో 85ను వ్యతిరేకిస్తూ వైద్యుల నిరసన

లింగసముద్రం, సెప్టెంబరు 19: జీవో నంబర్ 85ను వ్యతిరేకిస్తూ స్థానిక వైద్యులు నిరసన కొనసాగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా పీహెచ్‌సీలో వైద్యులు ఔట్ పేషెంట్ల సేవలు, వీడియో కాన్ఫరెన్సులు, టెలీ కాన్ఫరెన్సులు బంద్ చేశారు. అత్యవసర సేవలు మాత్రమే చూస్తున్నారు. దీని వలన రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే జీవో నంబర్ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ స్పందిస్తూ, అత్యవసర సర్వీసులు మాత్రమే చూస్తున్నామని, మిగతా సర్వీసులన్నీ స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్లు యధావిధిగా పని చేస్తున్నారని తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

సీతారామపురం, సెప్టెంబరు 19 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఆర్డీవో మధులత సూచించారు. స్థానిక కస్తూర్బా బాలికల విద్యా కేంద్రంలో గురువారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ఆర్డీవో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి సంరక్షించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్

కందుకూరు, సెప్టెంబరు 19: మున్సిపాలిటీ పరిధిలోని పొదుపు మహిళలు (మెప్మా బజార్) ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న అర్బన్‌మార్కెట్‌ను గురువారం మున్సిపల్ కమిషనర్ అనూష సందర్శించారు. వివిధ బ్యాంకులతో తీసుకున్న రుణాలతో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేస్తూ అర్బన్‌బజారులో ప్రదర్శించి విక్రయిస్తుండటం హర్షనీయం అన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు తక్కువ ధరలకే విక్రయిస్తున్నట్లు చెప్పారు. ప్రతినెలా మూడోవారం కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో ఈ అర్బన్‌మార్కెట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు.

సిబ్బంది పనితీరుపై విచారణ చేపట్టాలి

జలదంకి, సెప్టెంబర్ 19: స్థానిక ప్రాథమిక వైద్యశాల సిబ్బంది, వైద్యుల పనితీరుపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డె శ్రీనాథ్‌రెడ్డి గురువారం డిమాండ్ చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతో పేదలకు ప్రయోజనం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకే 24గంటల ఆసుపత్రి తప్ప వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్నారు. స్థానికులు, ప్రజాప్రతినిధుల నుండి అనేక ఫిర్యాదులు వస్తున్నా చర్యలు శూన్యమని పేర్కొన్నారు. ఇక్కడ పనిచేసే ఒక ఉద్యోగికి సరెండర్ పేరుతో 11మాసాలుగా జీతం అందడం లేదన్నారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా ఎమ్మెల్యే కాకర్ల జన్మదినం

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 19: ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను టీడీపీ మండల పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండల కన్వీనర్ బయ్యన్న, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్‌తో కలిసి టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో భారీ కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచి పెట్టి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకుడు చింతనబోయిన శివకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ఆశ్రమంలో చిన్నారులకు భోజనం ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బీ నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహులు, సందానీ, ఓబుల్‌రెడ్డి, జీ వెంకటేశ్వర్లు, నజీల్, మట్ల రామయ్య, లక్ష్మయ్య, కాంతారావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరులో: స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. కాకర్ల మధు, చీదర్ల మల్లికార్జున, ధనాల పేరయ్య, హనుమంత నాయుడు, మండవ మధు తదితరులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు : ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను గురువారం టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషిచేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అలాంటి వ్యక్తికి ప్రతిఒక్కరూ అండగా నిలిచి మద్దతు పలికినప్పుడే మండలం కూడా అబివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం బాణాసంచా పేలుస్తూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పోలిబోయిన శ్రీకాంత్‌యాదవ్, వైఎస్ ఎంపీపీ దేవనబోయిన మధు, తెలుగుయువత అధ్యక్షుడు ముజ్జె లక్ష్మినారాయణ, నాయకులు నాదిండ్ల రాజేంద్ర, తెల్లగొర్ల వెంకటయ్యయాదవ్, కొత్తులూరి మహదేవ, పొద మాధవరావు, యరగాటి మాలకొండారెడ్డి, ఏనుగు వెంకటేశ్వరరెడ్డి, దుద్దుకూరి వెంకటరత్నం పాల్గొన్నారు.

● సీతారామపురం: స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, సర్పంచ్ భాగ్యకుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి తురక వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు చంద్రరెడ్డి, ఆదినారాయణ, భోగినేని కాశీరత్తయ్య, పెద్దగౌస్, జాషువా, రాజశేఖర్ పాల్గొన్నారు.

●వింజమూరు: పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వరయాదవ్, గణపం సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అలాగే చాకలికొండ ఎలిమెంటరీ స్కూల్‌లో కోనల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వీట్లు పంచి పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. అన్న క్యాంటీన్‌లో బీజేపీ నాయకులు కదిరి రంగారావు ఆధ్వర్యంలో పేదలకు స్వీట్లు పంపిణీ చేశారు.

●జలదంకి: మండల కేంద్రంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జన్మదిన వేడుకలను పోటాపోటీగా నిర్వహించారు. అన్నవరంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు పూనూరు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా పార్టీ మండలాధ్యక్షుడు, యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. అలాగే జలదంకి బస్టాండ్‌లో మండలాధ్యక్షుడు మధురెడ్డి ఆధ్వర్యంలో పాల్గొని ఒకరికొకరు కేక్‌ను తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. జలదంకిలోని నిమ్మలపల్లి శీనయ్య రైస్‌మిల్ కూడలిలో కాకర్ల అభిమాని గంటా అశోక్, జనసేన నేత రామ్‌చైతన్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే సోదరుడు కాకర్ల వెంకట్, మధుసూదనరావు, రామక్రిష్ణారెడ్డి, పెంచలయ్యనాయుడులు కేక్ కట్ చేశారు.



వరికుంటపాడు : : సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

●కలిగిరి: టీడీపీ మండల కన్వీ నర్ బిజ్జం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కేకు కట్ చేసి టీడీపీ కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో చీమల తాతయ్య, కల్లూరు చంద్రమౌళి, జిర్రా అంకిరెడ్డి, జె మధన్‌కుమార్, చేరెడ్డి సుబ్బారెడ్డి, యర్రగుంట రమణారెడ్డి, కట్టా వెంకటేశ్వర్లు, పూసాల వెంగపనాయుడు, కేతినేని శివయ్య, స్వర్ణ కొండయ్య పాల్గొన్నారు.

●కొండాపురం: మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులు బాణాసంచా కాల్చి కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలినేని రమేష్, పోలినేని చంద్రబాబు నాయుడు, దాసరి అశోక్, టి.లక్ష్మీనారాయణ, నర్రా చెంచునాయుడు, బద్దిపూడి మాచర్ల, సుధాకర్, ఉదయగిరి మాలకొండయ్య పాల్గొన్నారు. ఆదిమూర్తిపురంలో జాగర్లమూడి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నేతలు వేడుకలు నిర్వహించారు.

పాఠశాలకు వాటర్‌కూలర్ బహూకరణ

లింగసముద్రం : ముత్యాలపాడు ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి పాదర్తి వెంకట లీలాకృష్ణ గురువారం రూ.20వేల వాటర్‌కూలర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా వెంకట లీలాకృష్ణను హెచ్ఎం శ్రీనివాసులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారద, వెంకట లీలాకృష్ణ తలిదండ్రులు పురుషోత్తం, వెంకట సత్యవతి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మాజీ ఎమ్మెల్యే వంటేరు

జలదంకి : మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి గురువారం స్వగ్రామం బ్రాహ్మణక్రాక హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సర్పంచ్ ఇండ్ల సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛతా హి కార్యక్రమంలో కార్యదర్శి నీరజ, ఉపసర్పంచ్ దగుమాటి మాల్యాద్రి రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు తల్లపనేని మధుసూదనరావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పేదలకు వరం



అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 19: ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్‌లో రూ. 5కే కడుపునిండా భోజనం తినవచ్చునని పేదలకు ఎంతో భరోసానిస్తోందని డీసీసీబీ మాజీ చైర్మన్ ధనుంజయరెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు తాళ్లూరి గిరినాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం వారు ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్‌లో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నా క్యాంటీన్ పేదలకు వరమన్నారు. ఆత్మకూరులోని అన్నా క్యాంటీన్‌లో ఏడాదికి 15 రోజులకు అయ్యే ఖర్చును బొల్లినేని ట్రస్ట్ భరిస్తుందని తాళ్లూరు గిరినాయుడు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, టీడీపీ నాయకులు చల్లా రవీంద్రరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చంద్రారెడ్డి, టీడీపీ నాయకులు చంద్ర వెంకటసుబ్బానాయుడు, జనసేన నాయకులు నలిశెట్టి శ్రీధర్, బీజేపీ నాయకులు కె సుధాకర్‌రెడ్డి, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



చిన్నారులకు కిట్లు అందజేస్తున్న బత్తుల పద్మావతి, అధికారులు

కందుకూరు, సెప్టెంబరు 19: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. పట్టణంలోని పద్మావతి ఫంక్షన్‌హాలులో గురువారం మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ, వరల్డ్‌విజన్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవ వేడుకలు సీడీపీఓ శర్మిష్ట అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పౌష్టికాహార లోపంతో తక్కువ బరువు ఉన్న 75 మంది చిన్నారులకు వరల్డ్‌విజన్ సంస్థ ద్వారా ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల విలువ జేసే పౌష్టికాహార కిట్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు తయారుచేసిన వివిధరకాల వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వరల్డ్‌విజన్ సంస్థ ప్రాజెక్టు మేనేజరు యోషయా, కేవీకే శాస్త్రవేత్త నీహారిక, వైద్యశాఖ నుంచి ఇంటూరి పద్మావతి, ఎంఈఓ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఉలవపాడు సీడీపీఓ అరుణ, పంతగాని వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

●ఉదయగిరి రూరల్ : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తేజస్విని అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు చాంద్‌బేగం, సంజీవరాణి, సుజాత, ప్రధానో పాధ్యా యులు షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహులు, బోసు, ఆశ కార్యకర్త సలోమి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గంధమహోత్సవాన్ని నిర్వహించండి

● జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

ఏఎస్ పేట, సెప్టెంబరు 19: ఏఎస్ పేట దర్గా గంధమహోత్సవం ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని నాయబ్ రసూల్ దర్గా గురించి ఎస్ఐ సైదు లును అడిగి తెలుసుకుని, ఈనెల 29వ తేదీ నుంచి జరిగే దర్గా గంధ మహోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌బి డీఎస్పీ శ్రీనివాసులు ఉన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం : డీఎస్పీ

కావలి, సెప్టెంబరు 19: శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపుతామన్నారు. పట్టణంలో ప్రధానంగా ఉన్న ట్రాఫిక్ సమస్య నివారణకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. మున్సిపల్ అధి కారులతో కలిసి ట్రంకు రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ వేసి అది దాటి రోడ్డు మీదకు ఎవరూ రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఓవర్ స్పీడ్, పెద్ద శబ్దాలతో బైక్‌లు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈవ్ టీజింగ్, క్రికెట్ బెట్టింగ్‌లు, సింగిల్ నంబరు ఆటలు ఆడే వారిపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. వ్యాపారులు, ప్రజలు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేర నియంత్రణకు సులువుగా ఉంటుందన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల అందజేత



విరాళాలను అందచేస్తున్న ఆపుస్మా నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 19: విజయవాడ వరద బాధితుల కోసం నియోజకవర్గంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు సేకరించిన విరాళాలను స్థానిక ఆపుస్మా నాయకులు స్టేట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డికి గురువారం అందచేశారు. ఆరు మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల నుంచి సేకరించిన మొత్తం రూ. 8,43,310 అందచేశారు. దీంతో ఆయన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రెసిడెంట్ కె కోటేశ్వరరెడ్డి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, జాయింట్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, జిల్లా సెక్రటరీ ఎస్ రామమోహన్‌రెడ్డి, శాంతినికేతన్ కరస్పాండెంట్ ప్రభాకర్, ట్రెజరర్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ న్యాయ సలహాదారుడిగా శివప్రసాద్‌రెడ్డి

కావలి, సెప్టెంబరు 19: స్థానిక పురపాలకసంఘ న్యాయ సలహా దారుడిగా న్యాయవాది పుల్లా వెంకటశివప్రసాద్‌రెడ్డిని నియమిస్తూ మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ నియామకపత్రాన్ని గురువారం అందజేశారు. ఈ నియామకానికి జారీచేసిన నోటిఫికేషన్‌లో వచ్చిన అర్జీలను కౌన్సిల్ ఎదుట ఉం చి వారి ఆమోదం మేరకు శివప్రసాద్‌రెడ్డిని నియమించినట్లు మున్సిపల్ కమి షనర్ తెలిపారు. ఈపదవిలో మూడేళ్లు కొన సాగుతారన్నారు.

రహదారి విస్తరణ పనులకు సహకరించండి



బ్లాస్టింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత

సీతారామపురం, సెప్టెంబరు 19: మండల పరిధిలో జరుగుతున్న 167/బి జాతీయ రహదారి పనులకు రైతులు సహకరించాలని ఆత్మకూరు ఆర్డీవో మధులత కోరారు. గురువారం మండలంలోని పబ్బులేటిపల్లిలో జరిగిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడుతూ ఆరు వరసల జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయితేనే ఈప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, అందువలన రైతులు కాంట్రాక్టర్లకు సహకరించాలన్నారు. భూములు కోల్పోయిన రైతులకు తక్కువ ప్రభుత్వ సాయం అందినట్లు అనిపించినట్లయితే వెంటనే ఉన్నతాధికారులకు అర్జీ సమర్పిస్తే పరిశీలించి మెరుగైన నష్టపరిహారం ఇచ్చేలా చూస్తామని తెలిపారు. మారంరెడ్డిపల్లిలో మాన్యం భూసమస్యను పరిశీలించి ఇరు వర్గాలతో మాట్లాడారు. అనంతరం ఆరు వరుస రహదారి టన్నల్ కేంద్రాన్ని, బ్లాస్టింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

రెండు నెలల్లో తాటిపర్తి రోడ్డు పూర్తి

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 19 : నెల్లూరు-తాటిపర్తి రహదారిని రెండు నెలల్లో పూర్తి చేస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆ రహదారి పనులకు గురువారం సౌత్‌మోపూరు వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రాకపోకలు సాగించలేనంత అధ్వానంగా తాటిపర్తి రోడ్డు ఉందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి రూ.5 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. రానున్న రెండు నెలల్లో నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ఈనెల 22వ తేదీన వేదగిరి క్షేత్రంలో నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, అందులో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం నెల్లూరులోని కార్యాలయంలో 31వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జి టీవీఎస్ కమల్‌ను కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. 20వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జి దువ్వూరు భాస్కర్‌రెడ్డి, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు తాళ్లూరు సురేష్ ఎమ్మెల్యేని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమాల్లో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, రాపూరు చంద్రశేఖర్, పముజుల ప్రదీప్, సీపీఐ నాయకుడు పముజుల దశరథరామయ్య పాల్గొన్నారు.

వేదగిరీశుడి సేవలో పోక్సో కోర్టు న్యాయాధికారి



స్వామి వారి సన్నిధి వద్ద న్యాయాధికారి సుమ

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 19 : మండలంలోని నరసింహ కొండపై వెలసి యున్న వేదగిరి లక్ష్మీనర సింహ స్వామిని జిల్లా పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ గురువారం దర్శించుకున్నారు. అర్చకులు నృసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ విశిష్టతను ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు వివరించారు.

● **బుచ్చిరెడ్డిపాళెం :** జొన్నవాడ కామాక్షితాయిని జిల్లా పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి సీ సుమ గురువారం దర్శించుకున్నారు. అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారి గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, శేషవస్త్రాలతో సత్కరించారు.

33 శాతం రిజర్వేషన్ల తీర్మానం హర్షణీయం

నెల్లూరు(హరనాథపురం) : ఎగువ సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం హర్షదాయకమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీసీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఉదయగిరి నరసింహులు గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తీర్మానాన్ని అసెంబ్లీలో ఆమోదించి పార్లమెంటుకు పంపాలనుకోవడం సంతోషకరమన్నారు. ఆ తీర్మానాన్ని పార్లమెంటు ఆమోదించేలా బీసీ సంఘాలన్నీ కృషి చేయాలని కోరారు.



కమిషనర్‌కు చెక్కు అందచేస్తున్న దాతలు

వరద బాధితులకు చేయూత



నెల్లూరు(సిటీ): విజయవాడ వరద బాధితుల సహాయార్థం నెల్లూరులోని హరనాథపురం వద్దనున్న పీపుల్స్ పార్కు ఆర్గనైజేషన్ కమిటీ సీఎం సహాయ నిధికి విరాళం అందించింది. ఈ మేరకు ఆ కమిటీ అధ్యక్షకార్యదర్శులు చినిగ శ్రీనివాసులురెడ్డి, దొడ్ల రవీంద్రరెడ్డి, సభ్యులు గురువారం కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజకు రూ.72,500ల నగదు చెక్కును అందచేశారు. దాతలను కమిషనర్ అభినందించారు.

డీకే కాలేజీ విద్యార్థినుల విరాళం

నెల్లూరు (విద్య) : వరద బాధితుల కోసం డీకే ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు సేకరించిన రూ.20వేల నగదు, దుప్పట్లు, చీరలు, బియ్యం, నిత్యావసరాలను గురువారం కళాశాలకు అందచేశారు. నగదును ముఖ్యమంత్రి సహాయ నిధికి జమ చేయడంతో పాటు వస్తువులను వీఎస్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్ విజయభాస్కర్‌కు అందచేసినట్లు ఆర్‌ఐవో శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ రిజిస్ట్రార్ సునీత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ కుమార్, ఆఫీసర్లు కరుణకుమారి భారతి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్ష కరపత్రం ఆవిష్కరించిన లోకేష్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నారా లోకేష్

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 19 : నెల్లూరు రూరల్లోని పేదలకు కార్పొరేట్ తరహా వైద్యం అందించేందుకు రూపకల్పన చేసిన నారా లోకేష్ ఆరోగ్య రక్ష కార్యక్రమ కరపత్రాన్ని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. రూరల్ ఎమ్మెల్యే సోదరుడు, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తాడేపల్లిలో లోకేష్‌ను కలిశారు. ఈ నెల 22వ తేదీన వేదగిరి క్షేత్రంలో ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో కరపత్రాన్ని లోకేష్ చేతులమీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, అరవ శ్రీనివాసులు పాల్గొన్నారు.

'యరగుడిపాటి'కి నివాళి

నెల్లూరు (సాంస్కృతికం): తల్పగిరి రంగనాథస్వామి ఆలయ తూర్పురాజగోపురం నిర్మించిన యరగుడిపాటి వెంకటాచలం పంతులు జయంతిని ఆలయం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వెంకటాచలం పంతులుకు ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామికి ఆలయం నుంచి చిత్రకూటం వరకు ఉత్సవం జరిగింది. ఆలయ అధ్యక్షుడు మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గుర్రం జాషువా గ్రంథాలయ కమిటీ సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 19 : పద్మభూషణ్ గుర్రం జాషువా జయంతి సందర్భంగా శుక్రవారం మద్రాసు బస్టాండు వద్ద గల జాషువా గ్రంథాలయంలో కమిటీ సమావేశం జరుగుతుందని గ్రంథాలయం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఖాసిం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు అందరూ హాజరుకావాలని కోరారు.

23న రౌండ్ టేబుల్ సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 19 : బహుజన సమాజ్ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23న నగరంలో బీసీ రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని ఆ పార్టీ కార్యదర్శి జానకీ ప్రసాద్, అధ్యక్షుడు పుష్పాంజలి తెలిపారు. ఈ సమావేశానికి మాజీ డీజీపీ జే పూర్ణచంద్రరావు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీ పరంజ్యోతి, నాయకులు హాజరవుతారని తెలిపారు. కాన్షీరామ్ వర్ధంతిని విజయవాడ అలంకార్ సెంటర్ ధర్నా చౌక్‌లో అక్టోబరు 9న నిర్వహిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల జన గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నాసిన భాస్కర్, ఎంబేటి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు నైపుణ్యాలను పెంచుకోవాలి

● సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకురాలు శారద

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 19 : విద్యార్థినులు నైపుణ్యాలను మెరుగుపరచుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకురాలు శారద సూచించారు. నగరంలోని డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా చదువుతోపాటు ఇతర కార్యక్రమాలనూ అవగాహన చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. నీహా సంస్థ ఆధ్వర్యంలో కళాశాలలో నెల రోజులు జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్‌ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు, ఎస్‌ఎస్‌ఏ ఏఎంవో సుధీర్‌బాబు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, అధ్యాపకులు శివయ్య, సమత, ప్రమీల, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షురాలు మాధవీలత, ప్రోగ్రాం ట్రైనర్ కల్యాణి పాల్గొన్నారు.

డీఏ బకాయిలు చెల్లించాలి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 19 : విశ్రాంత ఉద్యోగులకు 2018 నుంచి చెల్లించాల్సిన డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో కోరారు. 2018 నుంచి ఇప్పటి వరకు 12 డీఏల బకాయిలు చెల్లించాలని, కూటమి ప్రభుత్వం అందరికీ అన్నీ చేస్తోందని, విశ్రాంత ఉద్యోగులకు కూడా డీఏ బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 19 : వెంకటేశ్వరపురంలోని వికలాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. స్థానిక డీఎస్పీ వెంకటరమణ సహకారంతో ఈ పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్షుడు సనావుల్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

24న బాలు వర్ధంతి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 19 : గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు వాకర్స్ అసోసియేషన్ నాయకుడు కాయం శ్రీనివాసులు, కళాంజలి ఆర్కెస్ట్రా అధినేత కళాంజలి శ్రీనివాసులు వెల్లడించారు. గురువారం ఆదిత్యా నగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్క్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 24వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పాటల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఔత్సాహికులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాల తనిఖీ

నెల్లూరు(వైద్యం): నవాబుపేట రైతుబజార్ వద్ద ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, కిసాన్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య పరీక్షల తీరును, రికార్డులను పరిశీలించారు. క్షయ నివారణ వ్యాక్సిన్ పంపిణీని గమనించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వేణుగోపాల్, శివకుమార్, కో ఆర్డినేటర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ జట్ల ఎంపిక



వాలీబాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు


కోవూరు : మండలంలోని పాటూరు జడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక జరిగింది. పోటీలను హెచ్ఎం. గణపర్తి వెంకటేశ్వర్లునాయుడు ప్రారంభించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల్ని మండల జట్టుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పీడీలు రమేష్, దేవిక, డెలీల, వెంకటసుబ్బమ్మ, నాగరాజు, సాయి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు : మండలంలోని మహమ్మదాపురం జడ్పీ హైస్కూల్‌లో గురువారం మండలస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలను ఎంఈవో కె.రేణుక, పొదల కూరు, మహమ్మదాపురం హైస్కూల్ హెచ్ఎంలు సనత్‌కుమార్, రామకృష్ణలు ప్రారంభించారు. రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, జావలెన్, డిస్కస్‌త్రోలలో ఎంపికలు నిర్వహించారు.

తోటపల్లిగూడూరు: ఈనెల 20, 21వ తేదీల్లో మండలస్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో -2 జయరామనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మనుబోలు : స్థానిక ఉన్నత పాఠశాలల క్రీడామైదానంలో గురువారం మండలస్థాయి స్కూల్‌గేమ్స్ ప్రారంభమయ్యాయి. తొలిరోజు యోగా, 200,400మీటర్ల పరుగుపందెంలు, రిలే, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారిని నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికచేశారు. పోటీలను ఉన్నత పాఠశాలల పీడీలు పర్యవేక్షించారు. విద్యాకమిటీల సభ్యులకు తెలపకుండానే పోటీలు నిర్వహించారు.

రాహుల్‌పై వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 19 : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై బీజేపీ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామంటూ కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పార్టీ నేతలు నగరంలోని అంబేడ్కర్ బొమ్మ నుంచి గాంధీబొమ్మ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాయకుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ లోకసభలో ప్రధాన ప్రతిపక్షనేత అయిన రాహుల్‌గాంధీ పేదలు, మహిళలపై దాడుల గురించి ప్రశ్నిస్తే బీజేపీ నేతలు మాట్లాడిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. దీని వెనుక ప్రధాని మోదీ హస్తం ఉందన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. బీజేపీ చర్యలపై స్థానిక డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మీడియా ఇన్‌చార్జి సంజయ్ కుమార్, గణేష్‌బాబు, అల్లాఉద్దీన్, నసీమా సయ్యద్, సుధీర్, నరేష్, రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలినేని శ్రీనివాసరెడ్డికి జనసేన సత్కారం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీలో చేరుతున్నానని ప్రకటించడంతో నెల్లూరుకు చెందిన ఆ పార్టీ నాయకులు గురువారం ఒంగోలు జనసేన పార్టీ కార్యాలయంలో బాలినేనిని ఘనంగా సత్కరించారు. పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి, నెల్లూరు జిల్లా జనసేన పార్టీ పరిశీలకుడు వేములపాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ జనసేనలో బాలినేని చేరడం అభినందనీయమన్నారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని భావించి జనసేనలోకి ఎంతో మంది నాయకులు వస్తున్నారని చెప్పారు. నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ జనసేన పార్టీతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని ప్రజలందరూ నమ్ముతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్, సుందరరామిరెడ్డి, చిట్టమూరి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

వెంకటాచలం, సెప్టెంబరు 19 : మండలంలోని నిడిగుంటపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను గురువారం సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. యువతేజం ట్రస్ట్, కలామ్ విజన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందచేసిన ఆంగ్ల ఉపాధ్యాయులు సురేష్, కోటేశ్వరరావులు జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. దీంతో హెచ్ఎం సీహెచ్ చలపతి సమక్షంలో సన్మానం చేశారు.

రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడి మృతి



కోటారెడ్డి(ఫైల్)

కోవూరు, సెప్టెంబరు19: నెల్లూరు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు మోడెం కోటారెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. పడుగుపాడుకి చెందిన ఆయన ఇటీవల అనారోగ్యానికి గురై చెన్నైలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం పడుగుపాడులో అంత్యక్రియలు నిర్వహిస్తారని తెలిసింది. కోటారెడ్డి మృతితో పడుగుపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి.

మెప్మా ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ

బుచ్చిరెడ్డిపాళెం: మెప్మా ఆధ్వర్యంలో గురువారం స్థానిక బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కులో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా నగర పంచాయతీ కమిషనర్ ఎల్. చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా మెప్మా సీవో నర్మద, ఆర్పీలు పార్కులో పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం చీపుర్లు పట్టి చెత్తాచెదారం ఊడ్చారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కాగా జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో ఉద్యోగులు, సిబ్బంది ఆలయం లోపలా, బయటా నీటితో శుభ్రంచేశారు.

అంటువ్యాధులపై అవగాహన

వెంకటాచలం, సెప్టెంబరు 19 : మండలంలోని కాకుటూరులో గురువారం వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ - 4 ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి అంటువ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 4 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులున్నారు.

మధ్యాహ్న భోజన బియ్యంలో పురుగులు

● అధికారులకు తల్లిదండ్రుల ఫిర్యాదు ● వీఆర్వో విచారణ



బియ్యంలో ఉన్న పురుగులు, రాళ్లు

విడవలూరు, సెప్టెంబరు 19: మండలంలోని రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాల్లో గురువారం విద్యార్థులకు పెట్టే మధ్యాహ్నం భోజనం బియ్యంలో పురుగులు, రాళ్లు, చెత్త కనిపించాయి. పాఠశాల్లో సుమారు 25 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి మధ్యాహ్న భోజన పథకం కింద నెలకి 50కిలోల బియ్యాన్ని రేషన్ దుకాణం నుంచి అందచేస్తారు. ఈ క్రమంలో గురువారం 13 నెంబరు రేషన్ షాపు డీలరు 25 కేజీల బియ్యాన్ని నిర్వాహకురాలికి అందజేశారు. ఆమె పాఠశాలకు తీసుకుని వెళ్లి పరిశీలించగా అందులో రాళ్లు, పురుగులు, చెత్త ఉండటాన్ని గమనించి హెచ్‌ఎంకి తెలిపింది. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియటంతో వారు పాఠశాల వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. దీంతో హెచ్ఎం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వీఆర్వో గోవర్ధన్ పాఠశాలకి చేరుకుని బియ్యాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు పరిస్థితిని వివరించారు. ఈ విషయంపై రేషన్ డీలరు అరుణమ్మ మాట్లాడుతూ పాఠశాలకు బియ్యాన్ని ఇవ్వాలని ఎటువంటి అలాట్‌మెంట్ లేకపోయినా రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు బియ్యాన్ని ఇచ్చామని, అందులో రాళ్లు, పురుగులు లేవని, కావాలనే ఆరోపణలు చేస్తున్నారని పేర్కొంది. ఈ సంఘటనపై సీఎస్‌డీటీ బాలకోటమ్మని వివరణ కోరగా బియ్యంలో పురుగులు,రాళ్లు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పిల్లలతో భిక్షాటన చేస్తున్న వారికి కౌన్సెలింగ్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 19 : నగరంలోని పలు ప్రాంతాల్లో పసి పిల్లలతో కలిసి భిక్షాటన చేస్తున్న, చేయిస్తున్న మహిళలకు గురువారం జిల్లా బాలల సంరక్షణ విభాగం వారు కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలతో భిక్షాటన చేయిస్తే తల్లిదండ్రులకు విధించే శిక్షలను వివరించారు. వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి వారిపై పోలీసు కేసు నమోదు చేయించారు. పిల్లలను బాల సదనంలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో సురేష్, బాలల సంరక్షణ కమిటీ చైర్‌పర్సన్ టీ మాధవి, సభ్యులు నిహారిక, రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రావి ఆకుపై అక్కినేని చిత్రం



పొదలకూరు, సెప్టెంబరు 19 : తెలుగు సినీనటుడు స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా రావి ఆకుపై ఆయన చిత్రాన్ని మహమ్మదాపురానికి చెందిన విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ పచ్చ పెంచలయ్య గురువారం చిత్రీకరించారు. వివిధ సందర్భాల్లో ప్రముఖుల, దేవతా మూర్తుల చిత్రాలు గీయడం ఆయనకు అలవాటు.

నేటి నుంచి 'ఇది మంచి ప్రభుత్వం'

మనుబోలు, సెప్టెంబరు 19: మండలంలో శుక్రవారం నుంచి ఈనెల 26 వరకు ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ప్రతి పంచాయతీలో ప్రతి ఇంటికి అధికారులు వెళతారన్నారు. ఇంటికో స్టిక్కర్, కరపత్రం అందించి, వంద రోజుల్లో ప్రభుత్వం ప్రజలకు చేసిన సేవలు గురించి వివరిస్తారన్నారు.

● **సోమిరెడ్డి రాక**

తోటపల్లిగూడూరు : మండలంలోని పాపిరెడ్డిపాలెం గ్రామ సచివాలయంలో శుక్రవారం జరిగే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి పాల్గొంటారని టీడీపీ మండల అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

మనుబోలు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాకేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్‌నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒకవేళ సైబర్‌నేరాలకు గురైనప్పుడు 1930టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాయిబాబాకు కిరీటం బహూకరణ

మనుబోలు, సెప్టెంబరు 19: స్థానిక సాయిబాబా ఆలయంలో గురువారం బాబాకు దాతలు కిరీటాన్ని బహూకరించారు. మాజీ ఎంపీపీ చేరెడ్డి పట్టాభిరామిరెడ్డి దంపతులు, కలికి రమేష్ రెడ్డి, రేణుకాదేవి దంపతులు రూ. 30వేలు విలువచేసే కిరీటాన్ని బాబాగుడికి అందజేశారు. అభిషేకాలు అనంతరం కిరీటాన్ని బాబాకు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉభయదాతలు అన్న సంతర్పణ చేశారు.



కిరీటం అందజేస్తున్న దాతలు

యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



కార్యక్రమం ప్రారంభోత్సవంలో ప్రతినిధులు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 19 : భారత ప్రభుత్వం ఎంఎస్ఎంఈ ద్వారా యువ పారిశ్రామికవేత్తలను వివిధ పథకాలకు రాయితీలు ఇస్తూ ప్రోత్సహిస్తోందని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి తెలిపారు. నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువ పారిశ్రామికవేత్తలు వారి ఆలోచనలతో నూతన పరిశ్రమలు స్థాపించి ఎంతోమందికి ఉపాధి కల్పించవచ్చన్నారు. దీనికి సంబంధించిన ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాజశేఖర్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శాంతిరాజ్, ఎస్ బ్యాంక్ మేనేజర్ హరనాథ్, శారదా క్రియేషన్స్ అధినేత శారద తదితరులు వ్యాపారరంగంలో ఎలా ఎదగాలన్న అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులురెడ్డి, డీన్ డాక్టర్ కే విశ్వక్సేనారెడ్డి, ఏజీఎం బీవీ శ్రీధర్, డాక్టర్ ఎం చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలంరెడ్డి పరామర్శ

కోవూరు, సెప్టెంబరు19: టీడీపీ పట్టణ నాయకుడు బాలారవి తండ్రి రామయ్య ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్ రెడ్డి గురువారం పరామర్శించారు. నాయకులు సన్నపరెడ్డి వేణుగోపాలరెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, చెంబేటి పెంచలయ్య, నాటకరాని వెంకట్ పాల్గొన్నారు.


చినజీయర్‌ను కలిసిన టీడీపీ నేత

విడవలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా మండలంలోని ఊటుకూరుకి చెందిన టీడీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి గురువారం హైదరాబాద్‌లో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చినజీయర్ స్వామిని కలిశారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మరిన్ని సంక్షేమ పథకాలను అమలు పరచాలని, అందుకు దేవుని ఆశీర్వాదం ఉండాలని ఆయన చినజీయర్ స్వామిని కోరారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



తిరుపతి

జిల్లా వార్తలు

శుక్రవారం 20 సెప్టెంబరు 2024

కమీషన్ల కోసం కక్కుర్తిపడి..



శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు అవశేషాలు ఉన్నాయని తాము చెప్పడం కాదు.. ఎన్డీటీ ల్యాబ్ పరీక్షల్లో నిర్ధారణ అయింది. అదనపు ఈవోగా ధర్మారెడ్డి వచ్చాకే నెయ్యి గోల్‌మాల్ జరిగింది. కమీషన్ కోసం కక్కుర్తిపడి, భక్తుల మనోభావాలను దెబ్బతీశారు.

- నారా లోకేశ్, రాష్ట్ర మంత్రి

నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారు



వైసీపీ ప్రభుత్వంలో తిరుమల లడ్డూలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారు. లడ్డూ వాసన వస్తోందని నాడు భక్తులు ఈవో ధర్మారెడ్డికి ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం విచారణ జరిపించడంతో లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిపారని నిగ్గు తేలింది.

- ఆనం వెంకటరమణారెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

అది విదేశీ బట్టర్ ఆయిల్



స్వచ్ఛమైన ఆవునెయ్యి వాడితేనే శ్రీవారి లడ్డూకు నాణ్యత వస్తుంది. వైసీపీ హయాంలో.. పాలకమండలి పెద్దల కమీషన్ల కోసం కర్ణాటక సంస్థను కాదని ఢిల్లీకి చెందిన 'ఆల్ఫా'ను తీసుకొచ్చారు. విదేశాలనుంచి బట్టర్ ఆయిల్‌ను ప్రాసెస్‌చేసి, కలర్ కలిపి ఆవునెయ్యిగా మార్చి వాళ్లు సరఫరా చేశారు.

- ఓవీ రమణ, టీటీడీ మాజీ సభ్యుడు

ల్యాబ్ టెస్ట్‌లు చేయించకనే..



రోజుకు 14టన్నుల ఆవు నెయ్యిని టీటీడీ వినియోగిస్తోంది. ఈ నెయ్యికి ఎలాంటి ల్యాబ్ టెస్ట్‌లు చేయడంలేదు.నాణ్యతలేని నెయ్యితో శ్రీవారి లడ్డూ తయారు చేయడంతో రుచి లేకుండా పోయింది. వైసీపీ హయాంలో హిందువుల మనోభావాలు దెబ్బతినేలా టీటీడీని భ్రష్టు పట్టించారు.

- భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

లడ్డూ పవిత్రతను దెబ్బతీశారు



నాణ్యతలేని, కల్తీ నెయ్యిని సరఫరా చేసి పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాద పవిత్రతను దెబ్బతీశారు. నెయ్యి గోడౌన్‌లో పని చేసే వారే కల్తీ నెయ్యి విషయాన్ని నా దృష్టికి తెచ్చారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిని త్వరలోనే దోషులుగా నిలబెట్టబోతున్నాం.

- నరసింహ యాదవ్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు

నా బిడ్డను ఆదుకోండి



దత్తాత్రేయ (ఫైల్ ఫొటో)

- గత ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగికి యాక్సిడెంట్
- 8 నెలలుగా కోమాలోనే దత్తాత్రేయ
- జీతభత్యాలను నిలిపేసిన వైసీపీ సర్కార్
- తలకిందులైన బంగారు భవిష్యత్
- కుమిలిపోతున్న తల్లిదండ్రులు


చేతికొచ్చిన కొడుకు. సర్కారు కొలువు. జీవితం సెటిల్ అయిపోయిందనుకునేలోపే అంతా తారుమారైంది. అప్పటివరకు ఆనందంగా సాగిన ఆ కుటుంబ తలరాత ఒక్క యాక్సిడెంట్‌తో తలకిందులైపోయింది. మంచంమీదున్న బిడ్డను చూసుకుంటూ, అతను కన్న భవిష్యత్తును తలుచుకుంటూ ఆ తల్లిదండ్రులు కుమిలికుమిలి విలపిస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

చంద్రగిరి నియోజకవర్గం మల్లంగుంట రోడ్డు ఉత్తరపు కండ్రిగలోని లక్ష్మి, ఎల్లయ్య దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు దత్తాత్రేయ. ఇతడి తండ్రి తిరుపతి మున్సిపల్ కూరగాయల మార్కెట్లో చిన్న కిరాణ షాపు నిర్వహిస్తున్నారు. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలోని కామచిన్నయపల్లి సచివాలయంలో దత్తాత్రేయ వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. 'ఆడుదాం ఆంధ్ర' పోటీల నిర్వహణకోసం జెండాలు, ఫ్లెక్సీలు తీసుకుని గతేడాది డిసెంబరు 23వ తేది ఉదయం 7.30 ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై ఈయన బయలుదేరారు. చంద్రగిరి ఫ్లైఓవర్ (చెర్లోపల్లె) వద్ద యాక్సిడెంట్‌కు గురయ్యారు. ఏటీఎంలో నగదు నింపే వాహనం నిర్లక్ష్యంగా మలుపు తిప్పడంతో దత్తాత్రేయ వెళుతున్న ద్విచక్రవాహనానికి తగిలింది. హెల్మెట్ వేసుకున్నప్పటికీ ఆయన తలకు బలమైన గాయమైంది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన రుయాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లమని అక్కడి వైద్యులు సూచించారు. అంబులెన్స్‌లో చెన్నైకు తీసుకెళుతుండగా దారిలోనే పరిస్థితి విషమించింది. దీంతో వేలూరు సీఎంసీకి వెళ్లారు. తలకు సంక్లిష్టమైన పెద్ద ఆపరేషన్ చేశారు. 15రోజులు అక్కడే ఉంచుకుని, పోస్ట్ ఆపరేటివ్ చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లమన్నారు. మూడునెలలు ఆస్పత్రిలోనే వైద్యం చేసుకున్నారు. దెబ్బ బలంగా తగలడంతో కోమాలోకి వెళ్లారు. ఉన్నదంతా అమ్మి, అప్పులు చేసి రూ.50 లక్షల ఖర్చు పెట్టారు. అయినా అచేతన స్థితిలోనే దత్తాత్రేయ ఉన్నారు. ఇప్పుడు చేతిలో డబ్బులు లేవు. నెలనెలా ఆస్పత్రికి వెళ్లేందుకు, మందులు కొనసాగించేందుకు కూడా వీరికి కష్టంగా మారింది.

- దత్తాత్రేయ చదువులో ముందుండేవారు. ఢిల్లీకి వెళ్లి సివిల్స్‌కు శిక్షణ తీసుకోవాలని భావించారు. ఇంతలో సచివాలయ ఉద్యోగానికి ఎంపికకావడంతో ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు సిద్ధమయ్యేవారు. అతనొకటి తలిస్తే విధి మరొకటి తలిచింది. యాక్సిడెంట్‌కు గురికావడంతో మంచానికే పరిమితమవ్వాల్సి వచ్చింది.

- గతంలో సీఎం హోదాలో జగన్మోహన్ రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఆర్థిక సహాయం కోసం ఎదురుచూసే వాళ్లకు సచివాలయ ఉద్యోగి అయిన దత్తాత్రేయ మార్గదర్శకుడిగా ఉన్నారు. అలాంటిది ఇప్పుడు ఆయనే విధివంచితుడై సహాయం కోసం అచేతనంగా ఎదురు చూస్తున్నారు.



బిడ్డ ఆలనా పాలన చూస్తూ కుమిలిపోతున్న తల్లి

- విధి నిర్వహణలో ప్రమాదం జరిగినప్పటికీ డిసెంబరు నుంచి జీతభత్యాలు ఆపేశారు. ఆర్థిక సహకారం అందలేదు. కుటుంబ సభ్యులు అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయారు. సహచర ఉద్యోగులు మానవతాదృక్పథంతో తలాచేయి వేశారు కానీ అప్పటి జగన్‌రెడ్డి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని దత్తాత్రేయ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

అడుగడుగునా నీరాజనం

- మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం పలికిన శ్రేణులు





విమానాశ్రయం వద్ద మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు పులివర్తి నాని, సుధీర్‌రెడ్డి, గురజాల జగన్మోహన్, టీడీపీ అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కలెక్టరు వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌కు కూటమి శ్రేణులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో శుక్రవారం పర్యటన నిమిత్తం ఆయన గురువారం రాత్రి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు స్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఒకదశలో వీరిని పోలీసులు నియంత్రించలేకపోయారు. దాదాపు గంట పాటు పార్టీశ్రేణులను లోకేశ్ ఆప్యాయంగా పలకరించి ఫొటోలు దిగారు. రాత్రి 8.30 గంటలకు విమానాశ్రయం నుంచి కాన్వాయ్‌గా బంగారుపాళ్యానికి బయలుదేరారు. దామినేడు సర్కిల్ వద్ద పైనాపిల్ పండ్లతో టీడీపీ నేత డాలర్ దివాకర్ రెడ్డి స్వాగతం పలికారు. తాజ్ హోటల్, చంద్రగిరి సర్కిల్ వద్ద పెద్దఎత్తున పార్టీ శ్రేణులు లోకేశ్ కాన్వాయ్‌ను ఆపి 'జై లోకేశ్' నినాదాలతో హోరెత్తించారు. లోకేష్‌కు స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి (శ్రీకాళహస్తి), పులివర్తి నాని (చంద్రగిరి), ఆరణి శ్రీనివాసులు (తిరుపతి), నాయకులు సుగుణమ్మ, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ నేత ఇందుశేఖర్, శ్రీధర్ వర్మ, రవినాయుడు తదితరులున్నారు.



వరద బాధితుల కోసం..

- సీఎంకు రూ.పది లక్షలు అందించిన ఎస్సీవీ నాయుడు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు రూ.10లక్షలు విరాళం అందజేశారు. తన కుమారుడు ఎస్సీవీ శ్రీకాంత్‌తో కలిసి గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబుకు చెక్కు అందించారు. స్థానిక నాయకులు గోగినని భాస్కర్‌నాయుడు, సుబ్రహ్మణ్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి



రూ.10.08 లక్షలు ఇచ్చిన సైకం

వరద బాధితుల కోసం తిరుపతికి చెందిన సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ స్టేట్ మాజీ ఛైర్మన్ సైకం జయచంద్రారెడ్డి రూ. 10.08 లక్షలను విరాళంగా అందించారు. గురువారం తిరుపతికి వచ్చిన రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను కలిసి చెక్కు అందజేశారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి రూరల్

పేదల ఆకలి తీర్చేలా..



- 7 అన్న క్యాంటీన్ల ప్రారంభం

తిరుపతి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకు జిల్లాలో ఏడు అన్న క్యాంటీన్లను గురువారం ప్రారంభించారు. గత టీడీపీ ప్రభుత్వంలో పురుడు పోసుకున్న వీటిని.. వైసీపీ అధికారంలోకి రాగానే మూసేసిన విషయం తెలిసిందే. తాజాగా కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించింది. జిల్లాలో రెండో విడతగా తిరుపతి నగరం స్విమ్స్ సర్కిల్, ఈఎస్ఐ ఆస్పత్రి పక్కన, ఎమ్మార్‌పల్లె సర్కిల్ సమీపాన రెండింటితో పాటు నాలుగు.. గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేటలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఏడు అన్న క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి.

బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు

- అధికారుల సమీక్షలో టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమల, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై గురువారం సాయంత్రం తిరుపతిలోని టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో జిల్లా.. టీటీడీ అధికారులు, ఇతర శాఖలతో సమావేశం నిర్వహించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, జిల్లా యంత్రాంగం నుంచి ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, ఆర్టీసీ ఆర్ఎం చెంగల్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు.

- గత రెండేళ్లుగా వాహనాల రాకపోకలు పెరగడంతో తిరుమలలో పార్కింగ్ స్థలాల కొరత తీవ్రంగా ఉంది. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి తగిన సంఖ్యలో బస్సులు నడపాలి.
- అలిపిరి లింక్ బస్టాండ్, మున్సిపల్ గ్రౌండ్స్, వినాయకసాగర్ క్వార్టర్స్‌లో ద్విచక్రవాహనాలు.. భారతీయ విద్యాభవన్ స్కూల్‌లో ప్రైవేట్ జీపులు, కార్లు సహా అన్ని నాలుగు చక్రాల వాహనాలు.. ఎస్వీ జూపార్క్ పక్కనే ఉన్న దేవలోక్‌లో ప్రైవేట్ బస్సుల కోసం పార్కింగ్ ఏర్పాటు.
- చిన్నారులు తప్పిపోకుండా చైల్డ్ ట్యాగింగ్ ఏర్పాటు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు లగేజీ సెంటర్‌ను సేవాసదన్1, 2 ఎదురుగా మార్పు.
- నాలుగుమాడవీధుల్లో భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం. యాత్రికుల కోసం మరిన్ని 'మే ఐ హెల్ప్ యూ' సమాచార కేంద్రాల ఏర్పాటు.
- వైద్య శిబిరాలకోసం స్విమ్స్, రుయా, బర్డ్ నుంచి అదనపు వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని నియమించుకోవడం.
- తిరుమలలో మెరుగైన పారిశుధ్య పనులు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సమన్వయంతో నగరంలోనూ పారిశుధ్య పనుల కోసం విస్తృత ఏర్పాట్లు చేయాలి.

46 మంది కానిస్టేబుళ్ల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు19: జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న 46 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో కొందరిని పరిపాలనా సౌలభ్యం కోసం మార్చినా.. మరికొందరిపై అవినీతి ఆరోపణలు, పనితీరు సరిగా లేకపోవడం, ఫిర్యాదులు రావడంతో స్థానచలనం కల్పించారు. త్వరలో మరోసారి భారీ ఎత్తున కానిస్టేబుళ్లను బదిలీ చేయనున్నట్లు తెలిసింది.

యాచకుల్లా నటన.. భక్తుల్లా ముసుగు

- ఇద్దరు అంతర్రాష్ట్ర మహిళా దొంగల అరెస్టు
- రూ.7 లక్షల విలువైన బంగారు నగల స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 19: చంటి బిడ్డలను చంకన పెట్టుకుంటారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో భిక్షాటన చేసేలా నటిస్తారు. అదును చూసి.. ఏమార్చి చోరీలకు పాల్పడుతుంటారు. తిరుమలలోనూ భక్తుల ముసుగులోనూ చేతివాటం చూపి.. డబ్బు, నగలు, మొబైల్ ఫోన్లు తస్కరిస్తుంటారు. అలాంటి ఇద్దరు అంతర్రాష్ట్ర మహిళా దొంగలను తిరుపతి క్రైం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ వివరాలను జిల్లా క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం తూత్తికోరిన్ జిల్లా మంతితోప్పు గ్రామానికి చెందిన భగవత్ శారద, ఆర్.ప్రియ స్నేహితులు. ఏడేళ్లుగా వీరు తిరుమల, తిరుచానూరు బ్రహ్మోత్సవాలు, వెంకటగిరి జాతర.. కొండపై రద్దీ రోజుల్లో వీరు ఇక్కడకు వస్తారు. తిరుపతిలోని శ్రీనివాసం, ఉచిత సత్రాలు వద్ద తలదాచుకుంటారు. అదును చూసి చోరీలకు పాల్పడుతుంటారు. తరచూ తిరుమలకు వెళ్లి.. అక్కడ ఉచిత బస్సులు ఎక్కే సమయంలో బాగా రద్దీగా ఉంటే భక్తుల బ్యాగుల్లోని విలువైన నగలు, నగదు, సెల్‌ఫోన్లు కొట్టేస్తుంటారు. ఈ క్రమంలో తిరుమలలో రెండు.. తిరుపతి పోస్టల్ కాలనీలో ఒక దొంగతనంపై క్రైం పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై అదనపు ఎస్పీ నాగభూషణరావు నేతృత్వంలో క్రైం డీఎస్పీ రమణకుమార్, సీఐ అబ్బన్న, హెడ్ కానిస్టేబుళ్లు మురళి, గోపికృష్ణ, రమేష్, కానిస్టేబుళ్లు మోహన్, ప్రసాద్‌తో ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. నిందితులు పాత నేరస్తులని.. గతంలో పలుసార్లు అరెస్టయ్యారని గుర్తించారు. ఈ క్రమంలో ఫొటోల ఆధారంగా గురువారం తెల్లవారు జామున విష్ణునివాసం వద్ద చంకలో బిడ్డలను పెట్టుకుని తిరుగుతున్న ఇద్దరు మహిళలను అనుమానించి.. విచారించారు. దీంతో వీరి దొంగతనాలు బయటపడ్డాయి. వీరి నుంచి రూ.7 లక్షల విలువైన 70 గ్రాముల బంగారు నగలు, మూడు సెల్‌ఫోన్లు, రూ.6500 నగదు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ రమణకుమార్, సీఐ అబ్బన్న, సిబ్బందికి రివార్డుల కోసం ఎస్పీకి ప్రతిపాదనలు పంపుతున్నట్లు అదనపు ఎస్పీ చెప్పారు. తిరుమల, తిరుపతిలో పోగొట్టుకున్న సుండుపల్లికి చెందిన లక్ష్మీదేవి 33 గ్రాములు, పోస్టల్ కాలనీకి చెందిన ఆదిలక్ష్మి 40 గ్రాముల బంగారు నగలు, అలూరుకు చెందిన శ్రీనివాసులుకు రూ.6500, కర్ణాటకకు చెందిన దాస్, గుంటూరుకు చెందిన నరేంద్రకు సెల్‌ఫోన్లను పోలీసులు అప్పగించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు




గూడూరులో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్ - సూళ్లూరుపేట అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ మంత్రి పరసా

గూడూరు, సెప్టెంబరు 19: రాష్ట్రంలోని పేదల ఆకలిని తీర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం గూడూరు మండల పరిషత్ కార్యాలయ సమీపంలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5తో పేదల కడుపు నింపుకునేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేసి రూ.5కే టిఫిన్, భోజన సదుపాయం కల్పించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం పేదల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ అన్న క్యాంటీన్‌లను మూసివేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్‌లను పేదల కోసం అందుబాటులోకి తీసువచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా సీఎం నేరవేరుస్తూ పేదల సంక్షేమానికి బాటలు వేస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు క్యాంటీన్‌లో భోజనం చేశారు. కార్యక్రమంలో పాశం సంధ్యారాణి, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మట్టం శ్రావణి, అబ్దుల్ రహీమ్, భారతి, నాగరాజు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి ఎమ్మెల్యే అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను నేరవేర్చి మాటను నిలబెట్టుకుంటున్నారని అన్నారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరించడం హర్షణీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే విజయశ్రీ అన్న క్యాంటీన్‌లో భోజనాలను వడ్డించారు. మున్సిపల్ కమిషనర్ జనార్దరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, గంగాప్రసాద్, విజయకుమార్ నాయుడు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని గాండ్లవీధిలో ఉన్న స్త్రీ స్వశక్తి భవనం ఎదురుగా భవనంలో అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ , మాజీ మంత్రి పరసా వెంకటరత్నం ప్రారంభించారు. రూ.5కే భోజనాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.సుధాకర్ రెడ్డి, ఏ.రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, వాకచర్ల రమేష్, చిట్టేటి పెరుమాల్, పార్థసారథి, శ్రీనివాసులు నాయుడు, బి.పళని, శెల్వం, బీజేపీ నాయకులు ఆదినారాయణ రెడ్డి, మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు సెప్టెంబరు 19: ఐదేళ్ల జగన్ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగలిగే సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కొత్తూరు సర్పంచు సంచి కృష్ణయ్య, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కందముడి శివకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సైతం పక్కదారి పట్టించి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో పంచాయతీల పాలన మళ్లీ మెరుగు పడిందన్నారు. ఎన్నికల హామీలో భాగంగా నేడు అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించి ఎంతోమంది పేదలకు రుచికరమైన ఆహారం అందిస్తున్నారని కొనియాడారు. రాజధాని అమరావతి నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, మరుపూరు మస్తాన్‌రెడ్డి, వెంపర్ల వెంకటేశ్వర్లు, మురళీ నాయుడు, నరేంద్ర యాదవ్, యాళ్ల యుగందర్, గురవయ్య, వెంకటేష్, పరుశురాం, సురేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడలను తిలకిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 19: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం మండలస్థాయి స్కూల్ గేమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుడ్యంతో పాటు మానసిక వికాశం కలుగుతుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ముందుకుసాగాలని సూచించారు. ఎంఈవో మునిరత్నం మాట్లాడుతూ అండర్-14, అండర్-17 పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు 786 రఫీ, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, పసల గంగాప్రసాద్, కుబేరు మణి, నానాబాల సుబ్బారావు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి



డీటీ సురేంద్రకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

గూడూరు, సెప్టెంబరు 19: డివిజన్ పరిధిలోని రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు కోరారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు సురేంద్రకు డివిజన్ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేయాలన్నారు. రెండు లక్షల వరకు రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలన్నారు. అలాగే పంటలకు మద్దతు ధర ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, మురళీమోహన్‌రెడ్డి, చంద్రయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చాప్టర్‌తో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు



సీఎస్ఐ చాప్టర్‌ను ప్రారంభిస్తున్న ఆదిశంకర కళాశాల సిబ్బంది

గూడూరు, సెప్టెంబరు 19: సీఎస్ఐ చాప్టర్ ద్వారా అధ్యాపకులు, విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేణుమాదవ్ అన్నారు. గురువారం కళాశాలలో సీఎస్ఐ చాప్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్ఐ చాప్టర్ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు సభ్యత్వం తీసుకోవడం ద్వారా ఎటువంటి ఈవెంట్‌లనైనా నడపగలిగే అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజయ్య, రాజేష్, పద్మావతి, మూర్తి, ఇమ్మానుయేలు, కళ్యాణ చక్రవర్తి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

గూడూరు, సెప్టెంబరు 19: పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై శివసేన ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచిపద్ధతి కాదని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిమల వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక పోస్టాఫీసు వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న రాహుల్‌గాంధీపై శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారన్నారు. కార్యక్రమంలో సతీష్, శీను తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వెంకటగిరి, సెప్టెంబరు 19: వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం పట్టణంలోని వీఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. 1979 - 1982 విద్యా సంవత్సరాల్లో చదువుకున్న 120 మంది విద్యార్థులు సమావేశమయ్యారు. కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన పూర్వ విద్యార్థులు పేట మురళీరెడ్డి, బాలాజీలను అభినందించారు.

మట్టి టిప్పర్ల స్వాధీనం

తడ, సెప్టెంబరు 19: అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మాంబట్టు పంచాయతీలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయంటూ రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీంతో అధికారులు నిఘా పెట్టారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో పెదమాంబట్టు చెరువు వద్ద ఎక్స్‌కవేటర్ ద్వారా మట్టిని తవ్వి టిప్పర్లకు లోడ్‌చేసి తరలించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అపాచీ పరిశ్రమకు ఎదురుగా నిఘాపెట్టిన రెవెన్యూ అధికారులు మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. టిప్పర్ల డ్రైవర్లు పరారయ్యారు. వీఆర్వో ఉషా తహసీల్దారు శరత్‌బాబు దృష్టికి తీసుకువెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టిప్పర్లను పోలీసులకు స్వాధీనపరిచారు. కాగా, పలువురు నాయకులు టిప్పర్లను విడిపించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేసినట్లు తెలుస్తుంది.

వృద్ధుడి ఆత్మహత్య

గూడూరు, సెప్టెంబరు 19: స్థానిక తాళమ్మగుడి సమీపంలోని పొలాల్లో గురువారం ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు... నెల్లూరు జిల్లా పొదలకూరు ప్రాంతానికి చెందిన మస్తాన్(65) తాళమ్మగుడి సమీపంలోని ఓ రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే పొలంలోని రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నాడు. గురువారం పొలం వద్ద మస్తాన్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. పొలం యజమాని నరసారెడ్డి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

చీటింగ్ కేసు నమోదు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 19: నాయుడుపేట మండలం పండ్లూరు సమీపంలో ఉన్న సిమెంట్ ఇటుకలు తయారు చేసే కర్మాగారంలో రెండు కోట్ల పదహారు లక్షలు చీటింగ్ చేశారని ప్రస్తుత మేనేజర్ రషీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబీ తెలిపారు. 2022నుంచి ఇప్పటి వరకు కర్మాగారంలో తయారైన మెటీరియల్‌ను ఓ కంపెనీకి తరలించి అమ్మేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే కర్మాగారంలో మేనేజర్‌గా పని చేస్తున్న సురేష్‌బాబు, జలీల్, శాంతకుమార్, వల్లీ, దయాకర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు వెంకటగిరికి కలెక్టర్ రాక

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 19: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలనకు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం వెంకటగిరిలో పర్యటిస్తారని మున్సిపల్ కమిషనర్ రషీద్ గురువారం తెలిపారు. ఈనెల 25, 26వ తేదీల్లో జాతర నిర్వహించనున్న నేపథ్యంలో స్థానిక పింజల వీరయ్య కల్యాణ మండపంలో అధికారులతో కలెక్టర్ సమావేశం ఉంటుందన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

చిల్లకూరు, సెప్టెంబరు 19: మండలంలోని చేడిమాల గ్రామానికి చెందిన యనమల ప్రభాకర్ వైద్యఖర్చులకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ ప్రభాకర్ ఇటీవల గ్రామ సమీపంలోని రొయ్యల గుంట వద్దకు పనికి వెళ్లి ప్రమాదవశాత్తు తూములో పడడంతో కాలు విరిగిందన్నారు. అతని వైద్యఖర్చులకు తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.20వేలు నగదు అందజేశామన్నారు. కార్యక్రమంలో బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్య విరుద్ధం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 19: జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్య విరుద్ధమని సీపీఐ నాయకులు ప్రభాకర్, శశికుమార్ గురువారం పేర్కొన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక ఆలోచన సబబు కాదని, రాజ్యాంగ మౌలిక స్వరూపానికి, సమాఖ్యవాదానికి విరుద్ధమన్నారు. జమిలి ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 19: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో గురువారం పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరీశంకర్ మాట్లాడుతూ తిరుపతికి చెందిన వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ ఆస్పత్రి సహకారంతో వైద్యశిబిరాన్ని నిర్వహించామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించడం, కంటి అద్దాలను, మందులను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో సీతారామనాయుడు, కృష్ణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలి



గర్భిణులకు సన్మానం చేస్తున్న అధికారులు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 19: గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలని సీడీపీవో షంషాద్ బేగం అన్నారు. గురువారం స్థానిక పెట్లూరులో అంగన్‌వాడీ పోషణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ప్రతి రోజూ పాలు, గుడ్డు, ఆకు కూరలు, కూరగాయలు తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం గర్భిణులకు సన్మానం చేశారు. స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తంబిరెడ్డి తనూజ, ఎంపీడీవో కోటీశ్వరరావు, శివారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు దాతల విరాళం

వెంకటగిరి, సెప్టెంబరు 19: వెంకటగిరి పట్టణంలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించే గ్రామశక్తి పోలేరమ్మ జాతర నిర్వహణకు గురువారం దాతలు దొంతు వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి దంపతులు రూ.51118 విరాళంగా అందజేశారు.



విరాళం అందజేస్తున్న దాతలు

గూడూరు సర్వతోముఖాభివృద్ధికి చర్యలు



ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు అర్బన్, సెప్టెంబరు 19: గూడూరు సర్వతోముఖాభివృద్ధికి వంద రోజుల్లోనే నడకలు మొదలయ్యాయని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం ఆయన భవిష్యత్తు కార్యచరణను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. కొద్దిరోజుల్లోనే గూడూరును అన్ని రంగాల్లో అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలపడానికి కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఐదేళ్లుగా గూడూరును కంపు కొట్టించిన మురుగుకాలువల్లో పూడికతీత కోసం రూ.65లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పారిచెర్లవారిపాళెం - తూపిలిపాళెం రహదారి మరమ్మతుల కోసం రూ.74లక్షలతో పనులు ప్రారంభించినట్లు వివరించారు. రూ.1.70 కోట్లుతో నాయుడుపాళెం బ్రిడ్జిను నిర్మించేందుకు అనుమతులు సాధించినట్లు వెల్లడించారు. రెండురోజుల్లో బ్రిడ్జి నిర్మాణపనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు.

'ఇది మంచి ప్రభుత్వం'ను విజయవంతం చేయండి

ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు సంకల్పం మేరకు ప్రారంభించనున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కూటమి శ్రేణులకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అగాధంలో నుంచి ఆశాజనకమైన ప్రజా పాలనలోకి వచ్చేందుకు ఈ వంద రోజుల ఉపయోగపడ్డాయని అభివర్ణించారు. పెన్షన్‌ల పెంపుతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల అభిమానం చూరగొన్నట్లు ఆయన తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని కోట మండలం నుంచి శుక్రవారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. పది రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి విద్యార్థులకు ఆటల పోటీలు

ఓజిలి, సెప్టెంబరు 19: ఓజిలి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం ఓజిలి ఉన్నత పాఠశాల ఆవరణలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో శైలజ తెలిపారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్, బాల్‌బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ క్రీడల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

గణనాథుల గ్రామోత్సవం



బజారుసెంటర్‌లో ఊరేగుతున్న గణనాథుడు

కోట, సెప్టెంబరు 19: కోట పట్టణంలోని దళితవాడతో పాటు పలు గ్రామాల్లో గురువారం గణనాథుడి గ్రామోత్సవాలు జరిగాయి. కోటలోని దళితవాడలో భారీ గణేష్ విగ్రహాలతో బజారు సెంటర్‌లో గ్రామోత్సవం నిర్వహించారు. అక్కడి దళితవాడలోని దేవాలయం నుంచి వెంకటేశ్వరస్వామి, పద్మావతి విగ్రహాలతో పాటు వినాయక విగ్రహాలను ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నిమజ్జనం కోసం వాకాడు మండలం తూపిలిపాళెం తీసుకువెళ్లారు.

చిట్టేడులో మహాజన సభ



సమావేశంలో మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి శ్యామ్‌కుమార్

కోట, సెప్టెంబరు 19: మండల పరిధిలోని చిట్టేడు సహకార సంఘంలో గురువారం మహాజన సభ జరిగింది. సహకార సంఘ పర్సన్ ఇన్‌చార్జి శ్యామ్‌కుమార్, సీఈవో రామారావు రైతులకు సహకార సంఘం నుంచి అందించే రుణాలు, కొత్త పథకాలు, పీఎస్‌పీ లావాదేవీలపై అవగాహన కల్పించారు. సమావేశంలో సహకార సంఘ డైరెక్టర్లు చాపల శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ వెంకటేశ్వర్లు, కొత్తపాళెం, సిద్ధవరం, తిన్నెలపూడి సహకార సంఘాల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవాలు



గోవిందపల్లిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు

కోట, సెప్టెంబరు 19: మండల పరిధిలోని గోవిందపల్లి, రుద్రవరం, ఊనుగుంటపాళెం గ్రామాల్లో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అదే విధంగా గోవిందపల్లి ఉన్నత పాఠశాలలో కౌమారదశ బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు జరిగాయి. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కృష్ణమ్మ, కవిత, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

బోయిభీమన్న జయంతి

చిల్లకూరు, సెప్టెంబరు 19: మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం డాక్టర్ బోయి భీమన్న జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, ప్రజేంద్రరెడ్డి, మాధవయ్య, చంద్రశేఖర్, నాగభూషణమ్మ, ఆదిలక్ష్మి, కామేశ్వరి, మంజుశ్రీ, చిన్నమస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



గెలుపొందిన ట్రోఫీతో క్రీడాకారులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 19: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఫోరమ్ ప్రతినిధి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఆర్‌ఎం ట్రావెల్స్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన మండల స్థాయి కళాశాలల క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్టు సభ్యులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌యాదవ్, శరత్‌యాదవ్, మేకా శివకుమార్, చెంచయ్య, మస్తాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి విరాళం



ఎమ్మెల్యే విజయశ్రీకి చెక్కు అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 19: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి శ్రీవేమ విద్యాసంస్థల అధినేత పెమ్మారెడ్డి శ్రీనివాసులురెడ్డి రూ.51వేల చెక్కును సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి గురువారం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, రామిరెడ్డి, గిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 19: పట్టణంలో గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికారి ప్రతినిధి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన యువత స్వచ్ఛందంగా సభ్యత్వం నమోదు చేసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రణయ్, కార్తీక్, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం



డిగ్రీ కళాశాలలో పిచ్చి మొక్కలు తొలిగిస్తున్న విద్యార్థులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19: వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలను తొలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్‌శర్మ, అధ్యాపకులు ఏడుకొండలు, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జనసేన సంబరాలు

కోట, సెప్టెంబరు 19: కోట పట్టణంలో గురువారం జనసేన నాయకుల ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా జనసేన సీనియర్ నేత అల్లంబాబు, డాక్టర్ తిరుమలశెట్టి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కోట పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది చేత కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కృష్ణ, మల్లికార్జున్, నాగేంద్ర, గంగ పాల్గొన్నారు.

భక్తులకు పసుపు, కుంకుమ పంపిణీ

వెంకటగిరి, సెప్టెంబరు 19: వెంకటగిరి పట్టణంలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న గ్రామశక్తి పోలేరమ్మ జాతరను పురష్కరించుకొని గురువారం ఆలయం వద్ద మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ దొంతు శారద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రసాదంగా బావించే పసుపు, కుంకుమలను భక్తులకు పంపిణీ చేశారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికులు 500 మందికి రూ.500 నగదు, చీరలు అందజేశారు.

సత్యసాయికి పూజలు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 19: స్థానిక సనత్‌నగర్‌లోని సత్యసాయి స్పిరిచ్యువల్ సర్వీస్ సొసైటీలో గురువారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో భజనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సమితి సభ్యులు మాట్లాడుతూ యువతను ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల దృష్టిసారించేలా పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరి, సుబ్బారావు, భవానీ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.